# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 6-8-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:3 పేజీలు:6 వెల: రూ.1/-


**నమ్మలేని నిజాలు**

హేమా హేమీలు
ప్రపంచ ఫుట్బాలు గేమ్స్
విశ్వ బంధాలు.

నకిలీ రణం
'డీ అంటే డీ' ఓ మోసం
భ్రమ గ్రహణం.

బడి గంటలు
రుచికర వంటలు
తిండి చదువు.

శాంతి ఒప్పందం
వ్యూహాలకు పదును
యుద్ధం అనంతం.

నోట్ల కట్టలు
ఉపచార ఊటలు
పూల బేడీలు.



- రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

భారత్ ఫ్యూచర్ సిటీగ
మాస్టర్ ప్లాన్ పూర్తి !
దశదిశలా వెలుగబోవు
తెలంగాణ కీర్తి !
భవిష్యత్ కు ఎదుగుతుంది
ప్రపంచ స్థాయి నగరం !
భారత్ లో పెట్టుబడులు
పెట్టేవారికిది వరం !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి, ముసారాంబాగ్ బ్రిడ్జి పనులు పరిశీలించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్



హైదరాబాద్, ఆగస్టు 5:త్వరలోనే సైదాబాద్ స్టీల్ బ్రిడ్జిని ప్రారంభించి, హైదరాబాద్ నగరవాసులకు అందుబా టులోకి తీసుకొస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి అజారుద్దీన్‌తో కలిసి బుధవారం ఉదయం సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి, ముసారాంబాగ్ బ్రిడ్జి పనులను పొన్నం ప్రభాకర్ పరిశీలిచారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు సుమారు రూ.680 కోట్ల వ్యయంతో పూర్తయ్యాయని తెలిపారు. చంచల్‌గూడ జైలు నుంచి ఒవైసీ ఆసుపత్రి వరకు, మరోవైపు చంపాపేటకు అనుసంధానంగా ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి ఈ బ్రిడ్జిని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ బ్రిడ్జి ప్రారంభంతో సంతోష్ నగర్, చంచల్‌గూడ, సైదాబాద్ ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గుతాయని అన్నారు.

సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి తో పాటు మూసారాంబాగ్ బ్రిడ్జి తర్వలోనే అందుబాటులోకి తీసుకొస్తామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. మరోవైపు కేబీఆర్ పార్క్ వద్ద బ్రిడ్జి పనులు వేగంగా కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ట్రాఫిక్ , ప్రజా సేవల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు

## జమ్మూకశ్మీర్, లద్దాఖ్ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది: మోదీ



న్యూ ఢిల్లీ, ఆగస్టు 5: జమ్మూకశ్మీర్, లద్దాఖ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. ప్రతి పౌరుడు వికసిత్ భారత్ నిర్మాణంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఆర్టికల్స్ 370, 35(ఏ) రద్దుతో కొత్త అధ్యాయం ప్రారంభమైందని వ్యాఖ్యానించారు.

జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లో మౌలిక సదుపాయాలను విస్తరిస్తున్నామని ప్రధాని వెల్లడించారు. విద్య, వైద్యం, క్రీడలు, పారిశ్రామిక రంగాల్లో అవకాశాలు పెరిగాయని చెప్పుకొచ్చారు. మహిళలు, అణగారిన వర్గాలకు పూర్తిగా రాజ్యాంగ హక్కులు కల్పిస్తున్నామని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

డా.శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి నేడు. ఈ సందర్భంగా నివాళి అర్పించి వారిని స్మరించుకున్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ప్రధాని పోస్టు పెట్టారు

## పేలుళ్లతో దద్దరిల్లిన దుబాయ్.. 20 నిమిషాల్లో 7 దాడులు



న్యూఢిల్లీ, ఆగస్టు 5:దుబాయ్ వరుస పేలుళ్లతో దద్దరిల్లింది. బుధవారం వేకువఝామున 20 నిమిషాల్లో 7 పేలుళ్లు సంభవించాయి. దుబాయ్‌లోని జెబెల్ అలి ఇండస్ట్రియల్ జోన్ పరిధిలో ఈ పేలుళ్లు జరిగినట్లు ఎమిరాటి అధికారవర్గాలు తెలిపాయి. ఈ పేలుళ్లు, దాడులకు పాల్పడింది ఎవరు అనే విషయాన్ని మాత్రం దుబాయ్ అధికారులు వెల్లడించలేదు. పేలుళ్లు జరిగిన ప్రాంతంలో భారీగా మంటలు, పొగ వ్యాపించాయి. పోర్టు సమీపంలో చమురు నిల్వ, రవాణా చేసే ఒక వేర్‌హౌజ్ వద్ద భారీగా మంటలు వ్యాపించినట్లు స్థానికులు తెలిపారు. యెమెన్ జరిపిన మిస్సైల్ దాడుల వల్ల ఈ పేలుళ్లు జరిగాయని ఇరాకీ మీడియా వెల్లడించింది.

దీనిపై కూడా ఎమిరాటి అధికారులు స్పందించలేదు. ఈ పేలుళ్లకు సంబంధించిన దృశ్యాల్ని స్తానికులు వీడియో తీస్తుండగా అధికారులు అడ్డుకున్నారు. ఈ పేలుళ్ల కారణంగా స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పేలుడు జరిగిన ప్రదేశానికి దగ్గర్లోనే ప్రపంచంలోనే భారీ పోర్టు కూడా ఉంది. ఈ ఘటనలో జరిగిన ప్రాణ నష్టం, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలను కూడా అధికారులు తెలపలేదు. మరోవైపు యెమెన్ రాజధాని సనాలో కూడా పేలుళ్లు జరిగాయి. యెమెన్ భూభాగంలోకి వైమానిక దాడులు లేదా మిస్సైల్స్‌తో జరిపిన దాడుల వల్లే ఈ పేలుళ్లు జరిగాయని యెమెన్ అధికారులు అంటున్నారు. ఈ పేలుళ్ల వల్ల జరిగిన నష్టంపై అధికారులు ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఇంకోవైపు హోర్ముజ్ జలసంధిని మళ్లీ తెరిచే అంశంపై ఇరాన్, ఒమన్ మధ్య చర్చలు జరుగుతున్నాయి.ఇరాన్ ఆధీనంలో ఉన్న పర్షియన్ గల్ఫ్ ద్వారా నౌకలు ఎంటర్ అయ్యి, ఒమన్ ఆధీనంలో ఉన్న మార్గం నుంచి వెళ్లిపోతాయి. రెండు దేశాల మధ్య ఒప్పందం కుదిరితే నౌకల రవాణాకు ఎలాంటి ఆటంకం ఉండదు. ఈ ఒప్పందం కుదరాలంటే ముందుగా ఇరాన్ పోర్టులపై అమెరికా విధించిన ఆంక్షలు ఎత్తివేయాలి. అయితే, గతంలో ఈ ఒప్పందాన్ని అమెరికా వ్యతిరేకించింది. దీనివల్ల నౌక రవాణా మార్గం మొత్తం ఇరాన్‌కు వెళ్లిపోతుందని అమెరికా భావించింది. అయితే, ఈసారి అమెరికా సానుకూలంగా మారే అవకాశం ఉంది.

## ఇథనాల్ పెట్రోల్‌పై దుష్ప్రచారం.. బాంబే హైకోర్టు కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 5: ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ అంశానికి సంబంధించి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రతిష్టకు భంగం కలిగించేలా సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న కంటెంట్‌పై బాంబే హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ఎక్స్, మెటాలలో ఉన్న అభ్యంతరకర కంటెంట్‌ను వెంటనే తొలగించాలని ఆదేశించింది. ఇందులో ఏఐ ఆధారంగా క్రియేట్ చేసిన కంటెంట్ కూడా ఉందని పేర్కొంది.

సంబంధిత కంటెంట్‌ను ఎవరు సృష్టించారు ఎవరు అప్‌లోడ్ చేశారు? అనే వివరాలను తమకు అందజేయాలని ఎక్స్, మెటా సంస్థలను బాంబే హైకోర్టు ఆదేశించింది. సోషల్ మీడియా వేదికలపై తప్పుడు సమాచారం, మార్ఫింగ్ చేసిన వీడియోలు, ఏఐ ఆధారిత కంటెంట్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఆదేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సాంకేతికత అభివృద్ధి సహా ఏఐ బేస్డ్ కంటెంట్ వినియోగం రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో.. వ్యక్తుల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయకుండా చర్యలు చేపట్టాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.

## ఏడాదికి 1.80 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి: నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, ఆగస్టు 5: భారత్‌లో ప్రతి ఏడాది సగటును సుమారు 1.80 లక్షల మంది రోడ్డు ప్రమాదాలకు బలి అవుతున్నట్లు కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఇవాళ ఆయన రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడారు. చాలా బాధాకరమైన విషయమని, రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతి ఏడాది ఇండియాలో 1.80 లక్షల మంది మరణిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ప్రమాదాలను తగ్గించే అంశంపై చర్యలు తీసుకోవాలని ఎంపీ సుధానమూర్తి ప్రశ్న వేశారు. అందమైన రో?డ్లు ఉన్నాయని, కానీ ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని, ఇది రోడ్ల వల్ల కాదు అని, డ్రైవర్లు సరిగా నడపలేకపోవడం వల్లే అని సుధామూర్తి అన్నారు.జాతీయ రహదారులపై ప్రమాదాలను తగ్గించేందుకు ఆమె ఓ సూచన చేశారు. డ్రైవింగ్ లైసెన్సు ఇచ్చే ప్రక్రియ మరింత పటిష్టం చేయాలని సుధామూర్తి పేర్కొన్నారు. అయితే రోడ్డు ప్రమాదాల అంశంలో మనుషుల ప్రవర్తన చాలా ముఖ్యమైన అంశమని, డ్రైవింగ్ శిక్షణను పటిష్ఠం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి గడ్కరీ తెలిపారు. టోల్ ప్లాజాల వద్ద వసూల్ చేస్తున్న ఛార్జీల గురించి మాట్లాడుతూ.. ఫాస్టాగ్, యూపీఏ పేమెంట్ల గురించి వివరించారు. టోల్ ప్లాజాలను పూర్తిగా ఎత్తివేసి, స్మూత్‌గా ప్రయాణాలు సాగే రీతిలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

మంచి సర్వీస్ కావాలంటే డబ్బులు చెల్లించాలని, అన్ని ఊచితంగా దొరకవు అని ఆయన తెలిపారు. టోల్ ప్లాజా నిబంధనలను ఆయన వివరిస్తూ.. ఫాస్టాగ్ లేని వారికి టోల్ ఫీజును నగదు రూపంలో చెల్లిస్తే రెండింతలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఒకవేళ హైవేలపై యూపీఐ ద్వారా టోల్ ఫీజు చెల్లిస్తే, 1.25 రెట్లు ఫీజును వసూల్ చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. మాజీ ఎంపీలకు టోల్ పాసులను జారీ చేయాలని రాజ్యసభ చైర్మన్ రాధాకృష్ణన్ కోరారు.

## నూతన వంతెనపై ఈ నెలలోనే రాకపోకల పునరుద్ధరణ : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం, ఆగస్టు 5: ఈ నెలలోనే భద్రాచలం-సారపాక మధ్యలో నిర్మించిన నూతన వంతెనపై రాకపోకలను పునరుద్ధరిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం వంతెన వద్ద అప్రోచ్ పనులను ఆయన పరిశీలించారు. వంతెన పనులకు సంబంధించి ఇటీవల కాలంలో 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ కథనాలపై స్పందించిన మంత్రి తుమ్మల రెండవ వంతెన వద్ద అప్రోచ్ కుంగిపోయిన ప్రాంతాన్ని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. మూడు నెలలు గడిచినా పనులు ఆలస్యం ఎందుకు అవుతున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెలలోనే పనులు పూర్తిచేసి భద్రాచలం-సారపాక మధ్యలో నిర్మించిన రెండవ వంతెన రాకపోకలను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

భద్రాచలంలో గతంలో, అంతకుముందు పుష్కరాలకు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పాత వంతెన శిథిలావస్థకు చేరడంతో కొత్తగా రెండవ వంతెన నిర్మాణం చేపట్టడం జరిగిందని.. చాలా ఏళ్లుగా నిర్మాణ పనులు నత్తనడకన సాగడంతో గత ఏడాదే నూతన వంతెన నిర్మాణం పూర్తిచేసుకోవడం జరిగిందని తెలిపారు. ఇటీవల వచ్చిన గోదావరి వరదల కారణంగా కొత్త వంతెన వద్ద అప్రోచ్ కుంగిపోవడంతో రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపడుతున్నారని, త్వరితగతిన పనులు పూర్తిచేసి ఈ నెలలోనే కొత్త వంతెనపై రాకపోకలు పునరుద్ధరిస్తామని, వంతెన అప్రోచ్ పనుల విషయంలోనూ అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తుమ్మల తెలిపారు. ఆయన వెంట భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, సారపాక, భద్రాచలం సర్పంచులు గుగులోత్ కిశోర్‌నాయక్, పూనెం కృష్ణ, సారపాక ఉప సర్పంచ్ కన్నెదారి రమేశ్, ఎస్‌పి సమీర్, తిరుపతి చంటి, ఐటీసీ గుర్తింపు సంఘం అధ్యక్షుడు కనకమేడల హరిప్రసాద్, సంబంధిత శాఖ అధికారులు ఉన్నారు.

## మండలి వెంకట కృష్ణారావు జయంతి



వెంకట కృష్ణారావుకు నివాళులర్పిస్తున్న కె.వి.రమణాచారి

హైదరాబాద్, ఆగస్టు 5: కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ప్రపంచ తెలుగు మహాసభల సూత్రధారి మండలి వెంకట కృష్ణారావు శతజయంతి మహోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి ముఖ్య అతిథిగా పాల్గొని వెంకట కృష్ణారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత విభావరి పలువురిని అలరించింది. ఈ కార్యక్రమంలో బి. లక్ష్మీకాంతం, ఎల్‌వీఎస్‌ఆర్‌కె. ప్రసాద్, వి.ఆర్.కె.ఫణి, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి చాక్లెట్ల విక్రయం.. బిహార్‌కు చెందిన రంజిత్ కుమార్ అరెస్ట్

హైదరాబాద్, ఆగస్టు 5:దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న బిహార్‌కు చెందిన రంజిత్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో దుండిగల్ తండా-2లో తనిఖీలు చేశారు. నిందితుడి దగ్గరి నుంచి 350 గ్రాముల 71 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు.

కాజీపల్లిలోని కంపెనీలో లేబర్‌గా పనిచేస్తూ దుండిగల్ తండా-2లో నిందితుడు రంజిత్ కుమార్ నివాసం ఉంటునట్లు పోలీసులు వెల్లడించారు. బిహార్‌లోని తన అత్తగారి ఊరి నుంచి గంజాయి చాక్లెట్లను కొనుగోలు చేసి తీసుకువచ్చినట్లు తెలిపారు. తండాలోని స్థానిక కార్మికులకు, లేబర్లకు గంజాయి చాక్లెట్లను అమ్ముతుండగా రెడ్ హ్యాండెడ్‌గా పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## డయల్ 112 కాల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించడానికి వీల్లేదు: డీజీపీ సీవీ ఆనంద్



హైదరాబాద్, ఆగస్టు 5:న్యాయసాయం, వైద్యసాయం, సైబర్‌సాయం అనేక సమస్యల పరిష్కారాలకు డయల్ 112 పరిష్కార మార్గమని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. డయల్ 112కు ఫోన్ చేసినప్పుడు పోలీసులు దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఈరోజు (బుధవారం) హైదరాబాద్ వేదికగా డీజీపీ మాట్లాడారు. డయల్ 112 కాల్ రాగానే కాలర్ లొకేషన్ కోసం అడ్వాన్స్ అల్స్ వాడుతున్నామని పేర్కొన్నారు. డ్రోన్ బెస్ట్ టెక్నికల్ సిస్టంను త్వరలోనే తెలంగాణ పోలీసులు ఉపయోగిస్తారని వివరించారు. డ్రోన్ టీమ్‌ను సైతం ఏర్పాటు చేయబోతున్నామని చెప్పుకొచ్చారు. డయల్ 112 అనేది 3.0 వర్షన్‌గా ఉంటుందని తెలిపారు.

యువ ఏపీఎస్‌లు, ఏఐ టెక్నాలజీ వాడే వారిని ఇందులో భాగస్వామ్యం చేయబోతున్నామని డీజీపీ ఆనంద్ పేర్కొన్నారు. బేసిక్ పోలీసింగ్ లాగా టెక్నాలజీ పోలీసింగ్‌ను అమల్లోకి తీసుకువస్తున్నామని వ్యాఖ్యానించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ టవర్ :లో రెండు ఫ్లోర్‌లను డయల్ 112కి కేటాయించామని తెలిపారు. డయల్ 100ను 2013లో కొంపల్లిలో ఉ ఎఐ వారి సాయంతో ప్రారంభించామని ప్రస్తావించారు. వివిధ అత్యవసరాలకు ఒకే నంబర్ ఉండాలని గతంలో కేంద్ర ప్రభుత్వం సూచించిందని వెల్లడించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత టెక్నికల్ డెవలప్ మెంట్ చేస్తూ వచ్చామని చెప్పుకొచ్చారు. ఇటీవల ఏఐ వచ్చాక అనేక పనులు సలువుగా మారాయని డీజీపీ ఆనంద్ వెల్లడించారు.

## ఈవీఎం గోదాం నెలవారి తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు




ములుగు, ఆగస్టు 5:(నేటినిజం ప్రతినిధి)ఈవీఎం గోదాం ను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు నెలవారి తనిఖీ నిర్వహించారు.

బుధవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నెలవారి తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్ ను పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, అగ్నిప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఇతర భద్రతా పరికరాలను తనిఖీ చేశారు.అత్యవసర పరిస్థితులు తలెత్తిన సందర్భంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా రిజిష్టర్ లు సందర్శకుల నమోదు పుస్తకాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని భద్రతా సిబ్బందిని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు ప్రతి నెల గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి రాజీ లేకుండా 24 గంటలు భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, గోదాంలోని భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎం.డి. సలీం, డిప్యూటీ తహసీల్దార్ నితీష్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**చురక**

అధినేతల పైన నేడు
అనుచరుల భక్తి పూత
దేవడిని కొలిచేలాగ
దేనికింత భజన మోత.
అధికారం అవినీతితో
ఆర్జించుటే లక్ష్యం
పైవారిని అందుకొరకే
ప్రణమిల్లుటే సాక్ష్యం



-వేల్పుల నారాయణ
9440433475

**రాధశ్రీ రాగాలు**

చక్కని లతకు పాదు
సైపబో దపవాదు
అది హైదరాబాదు
అనును రాధశ్రీ !!
స్వామి నామోచ్చరణ
సతత మాతని స్మరణ
కలుగ జేయును కరుణ
అనును రాధశ్రీ !!



-రాధశ్రీ
సెల్:9494481210

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీఆర్ఎస్ నాయకుడు దాసరి రమేష్‌ను పరామర్శించిన ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు

ములుగు, ఆగస్టు 5:(నేటినిజం ప్రతినిధి)ములుగు జిల్లా వెంకటాపురం మండలం నల్లకుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు దాసరి రమేష్ ఇటీవల ద్విచక్ర వాహన ప్రమాదానికి గురై కాలు ఫ్రాక్చర్ అయిన విషయం తెలుసుకున్న ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు గారు వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు గారు రమేష్ ఆరోగ్య పరిస్థితిని, అందిస్తున్న వైద్య చికిత్సల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రమేష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, పార్టీ తరఫున ఎల్లప్పుడూ పూర్తి సహకారం, అండదండలు ఉంటాయని ధైర్యం చెప్పారు.ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పోరిక గోవింద నాయక్, మల్క రమేష్, లింగాల రమణారెడ్డి, గయ్ అశోక్, అబ్బ గోపాల్ రెడ్డి, తాటి కృష్ణ, భూక్య జంపన్న, కొమరం దనలక్ష్మి, ఎండి బలి బాబా, తుమ్మ మల్లారెడ్డి, జంగాలపల్లి సర్పంచ్, ముడతనపల్లి మోహన్, నర్ర భద్రయ్య, పోరిక అర్జు నాయక్, పోశాల వీరమల్లు, సంపత్ రెడ్డి, జనగాం రవి, ఎర్రబెల్లి గోపాలరావు, పిన్నింటి మధుసూదన్ రెడ్డి, గుండ్ల రమేష్, అజ్మీర సాదరులాల్, దుర్గం రమణయ్య, కోయిల మహేష్, భాష నాగ రమేష్, కర్ర రవీందర్‌తదితరులు పాల్గొన్నారు.

నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 గురువారం 6-8-2026

## వాన చినుకులకు నేల ఊసులు

ఎండకు ఎండిన నేల
గగనపు భుజాలకై ఎదురుచూసింది,
గాలికీ ఎండకీ మధ్య తన చర్మం పగిలినా,
ఊపిరిగా విత్తనం తాగిపెట్టే తల్లి నేల.
మబ్బు పల్లకిలోంచి జారిన చినుకులు,
మొదటి ముద్దుగా లాగి కౌగిలింతై,
తన దాహానికి పునాదులా రాలితే,
పగిలిన గీతలు సంతోషపు గీతలై విరియాయి.
“ఓ చినుకూ!
నిన్ను కోసం నా వీపు పగిలింది,
కన్నీటిని ఎండలో ఆవిరి చేసుకున్నా,
నీటి చప్పుడు పాడే కలలో నిద్రలేక ఊరుకుంది.
నువ్వు రాగాల్లా జాలువారితే,
నా చిగురులు నవ్వుతాయి,
విత్తనపు గుండెలో జీవపు లలిత ప్రవంతి,
పొలపు గడ్డపై పచ్చని రాగమై విరుస్తుంది.
నీ చాటున నేనెన్నో తీరని మాటలు చెబుతా,
విత్తుకి ఊపిరి, రైతుకి నిగరెత,
మట్టిలోంచి గాలికి గీత
ఆకాశపు మనసు నేలపై సాక్షి
ఎండలో ఎండిన పగిలిన బాటలు
వర్షపు ముద్దుతో తిరిగి పూయబోతున్నాయి
నీటి సుగంధం గాలిలో నెమ్మది
పగిలిన నేలకూ కొత్త జీవితపు గీత.



**-అనుముల రాహుల్**
సెల్:9705579179

## వేట నా ఆట కాదు

ఎవరీ సౌందర్య సీమను
దగ్ధ మరుభూమిగా కాల్చుతున్నది?
సుతిమెత్తని వెన్నెల కిరణాలను లాగి
పదునెక్కిన విచ్చుకత్తుల్లా మారుస్తున్నది?
హరివిల్లుకు రంగులద్దే ఊహలను చిదిమి
విద్వేషాల రాత్రి దుఃఖంలో ముంచి
నువ్వూ నేననే విషాన్ని మనం అనుకున్న
మన మోహాలకు చిమ్మ చీకటి మసిగా
పులుముతున్నది.
ఈ యుద్ధాలు ఈరోజున ఆకాశం దిగివచ్చిన
అద్భుతాలు కావు
నువ్వూ నేనూ పుట్టకముందే
వెయ్యిన్నొక్కసార్లు కళ్ళునెత్తినపెట్టుకు నడిచి
కాలు జారి బొక్కబోర్లాపడి
తలలు బొప్పికట్టి
తలదించుకు వెనక్కు తిరిగినవే
రథాలెక్కి ఊరేగే రాజులకు పహరాగా
చుట్టూ పదహారు మంది రక్షకులైనదీ
అందలాలెక్కే కాళ్ళకు నిచ్చెనలైనది
అదిగో యుగాలుగా నువ్వూ నేనే కదా
అడుగడుగునా రక్తతర్పణాలు
ప్రవహించి ప్రవహించి ఇంకిపోయిన నేల
మరుభూమిగా మారి
మళ్ళీ ఎడారి మొక్కలుగా మొలిచినదీ
నువ్వూ నేనేగా.
ప్రశ్నలూ జవాబుల కాలం అంతరించిపోయింది
కాపలా కాస్తున్న వెయ్యికళ్ళకు
ఎక్కడో ఒక చోట ఓ చిన్న మెలిక
ఓ చిన్నలొసుగు చాలు
అధికారాలు విసిరి, మచ్చిక చేసుకున్న
కుక్కలను వెంటేసుకు
రాజసాలు ఒలకబోసేందుకు
తలదాచుకుందుకు వెతుక్కున్న దిగంతాలు
వెచ్చని సూరీడునూ, వెన్నెల మడుగులో
జలకాలాడే పున్నమి బాలుడినీ
వెలుగుల చుక్కలనూ
ఎప్పటికప్పుడు గుటుక్కున మింగే
కొండచిలువలవి.
కొత్తబిచ్చగాళ్ళు పొద్దెరుగరు
రాత్రింబవళ్ళు జోలెపట్టుకు తిరగడమే పని
అధికారాల కోసం, అందలాల కోసం
ఊరుకోసం, పేరు కోసం
నకిలీ అర్హతలు పులితోళ్ళలాకప్పుకు
మాటల మత్తుబిళ్ళలు నోటినిండా నింపుకు
రాచరికం వెళ్ళబోస్తూ చేతులు చాపుతూనే ఉంటారు
పాపం
వెన్నుముక లేకుండా పుట్టిన అమీబాలు.
ఇప్పుడు అర్హతలంటే బలాబలాలు తేల్చుకోడమే
బరిలోకి దిగేది మేధస్సు కాదు
వాక్సంపదా కాదు
తరంగాలు తరంగాలుగా ఎగసి
వాదనలై , అశ్లీలాలై సునామీగా విరుచుకుపడే
సృజనాత్మకత రూపం
ఈ నాటి అద్దంలో రాజకీయప్రతిబింబమే
రవిగాంచని చో కవిగాంచుననే వారు
కవి ఎవరో మరి కాసుల గలగలకే తెలుసు
గద్దెలెక్కిన ఘనులకే తెలుసు
భావ సముద్రాలు ఈదే భావుకులకు కాదు
రాత్రీ పగలూ నిచ్చెనలు లేని అంబరాన్నెక్కి
సూరీడినీ, చుక్కలనూ , నెలవంకనూ బుజ్జగించి
వెంట తెచ్చుకునే అమాయక స్వాప్నికులకూ కాదు
సిఫారసుల ఎముకలు ఎరవేసి చేపట్టే పదవులూ
పన్నీరాలూ ఎందుకులే
ఎదురుచూస్తున్న పదపల్లవాలను పలకరించాలి
ప్రతి ఉదయమూ పూల తివాసీ పరచే
కవితలు అల్లుకోవాలి
ప్రతి సాయంత్రం పరిమళాలు రువ్వే
సుగంధ బావాలు
మల్లెపొదల తలిరాకుల నోమారు
మనసారా పరామర్శించాలి.
వేట నా ఆట కాదు.



**-స్వాతీ శ్రీపాద**
8297248988

# అలరించిన బాలల కథలు

పుస్తక సమీక్ష


“పిల్లల భావావేశాలను స్కూళ్ళు, లేదా స్కూళ్ళలోని పాఠ్యాంశాలు పట్టించుకోవటం లేదు. వీటిని వెలుపలి అంశాలే నిర్ణయిస్తున్నాయి. టెలివిజన్, పాప్ సంగీతం, క్రీడలు, బొమ్మల పత్రికలు, సెక్స్ పత్రికలు పిల్లల భావావేశానికి ఉపశమనం కల్పిస్తున్నాయి. పెద్దల నిర్బంధం నుండి స్వేచ్ఛ వారికి కల్పించాలి” అంటాడు స్కాట్లాండ్ విద్యావేత్త, రచయిత ఎ.ఎస్.నీల్ (1883-1973). సుమారు శతాబ్ది కాలం క్రితం వీరు చెప్పిన ఈ అంశాలతో బాటు నేడు పై వాటికి తోడుగా కంప్యూటర్‌లు సెల్‌ఫోన్లు, సినిమాలు మన పిల్లల్ని మరింతగా ప్రభావితం చేస్తున్నాయి. ఇంట్లో తల్లితండ్రులు కాని, స్కూళ్ళలో అధ్యాపకులుగాని పిల్లల భావావేశాలను అర్థం చేసుకుని వారికి సరియైన మార్గంలోకి మళ్ళించే ప్రయత్నాలు, అవకాశాలు ఇప్పటికీ దాదాపు శూన్యమనే చెప్పాలి. సర్వతోముఖంగా అభివృద్ధి చెందుతోన్న నేటి కాలానికి బాల సాహిత్యాభివృద్ధి ఒక చారిత్రక, అనివార్యమైన బాధ్యతగా చెప్పవచ్చును. దాదాపు ఒక శతాబ్దం గడిచిన తర్వాత కూడా, బాల సాహిత్యం తగినంత అభివృద్ధి చెందలేదు. **“తోచిందేదో రాసి పడేస్తే స్వీకరించే దిశలో నేటి బాలలు లేరు.”** అంటారు ప్రముఖ బాలసాహితీవేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ వారి బాల సాహిత్య పురస్కార గ్రహీత డా॥పత్తిపాక మోహన్. వీరు ఇంకా ఇలా అంటారు **“మన లోకంలోకి వాళ్ళను లాక్కొచ్చే ప్రయత్నం చేసేకంటే, వాళ్ళ లోకంలోకి మనం వెళ్తే బావుంటుంది”** అని.

గత శతాబ్దంన్నర కాలం నుండి బాల సాహిత్య అవసరం అటు ప్రభుత్వాలు, ఇటు ప్రజలు గుర్తించారు. ఎందరో రచయితలు ప్రభావ పూరితమైన బాల సాహిత్య సృష్టి చేస్తున్నారు. మరొక ఆనందకరమైన పరిణామం ఏమంటే- పిల్లల గురించి పిల్లలే. తమకు కావల్సిన సాహిత్యాన్ని సృష్టించుకునే అవకాశాన్ని ప్రోద్భలాన్ని కల్పించటం.

ఉభయ రాష్ట్రాల్లోని తెలుగు రచయితలు బాల సాహిత్యం వేపు దృష్టి సారిస్తున్నారు. సర్వశ్రీ గంగిశెట్టి శివకుమార్ ఎం.హరికిషన్, ముంజులూరి కృష్ణకుమారి, పుల్లా రామాంజనేయులు వంటి వారలు ఆంధ్ర రాష్ట్రం నుండి డా॥ పత్తిపాక మోహన్, గరిపెల్లి అశోక్, డా॥వి.ఆర్.శర్మ, డా॥భూపాల్, కందేపి రాణీప్రసాద్, సమ్మెట ఉమాదేవి, సమ్మెట విజయ, కో.బు.రె. లాంటి ప్రముఖులు తెలంగాణ రాష్ట్రం నుండి, బాల చెలిమి లాంటి పత్రికలు బాల సాహిత్యానికి ఇతోధికంగా ప్రోత్సాహమిస్తున్నారు. సాహితీవేత్తలు బాలల గురించి ప్రవాయటం ఒక ఎత్తు అయితే, బాలలే వాళ్ళకు కావాల్సిన సాహిత్యం సృష్టించుకోవటం మరో ఎత్తు. ఇందుకు బాల చెలిమి పత్రికాధినేత డా॥వేద కుమార్ చేస్తోన్న కృషి ప్రశంసనీయం.

కథ, నవల, ఆధ్యాత్మిక వ్యాస రచయిత ఆర్.సి.కృష్ణంరాజు సాహిత్య రంగంలో చేస్తున్న కృషి ప్రధానంగా చెప్పుకోదగినది. ఇంత వరకు వీరు 23 పుస్తకాలను వెలువరించారు. రాజుగారి కథలు, రాణిగారి కథలు,ముని కిష్టడి మాణిక్యం, కార్వేటి నగరం కథలు, నాన్నారం కథలు బాల సాహిత్యానికి అందించిన వీరు ఇప్పుడు **“కటకటా మర్కటా/ బాలల బొమ్మల కథలు”** అందిస్తున్నారు.

తనదైన రాయలసీమ, యాస, భాష, సులభగ్రాహ్యమైన శైలి, రాజుగారి ప్రత్యేకత. గ్రాంథికం, జానపదం, పౌరాణికం ఆధ్యాత్మికత, కథ, చిన్నకథ, కార్డు కథ, ఒక్క నిముషం కథ ఏ ప్రక్రియ చేపట్టినా సంపూర్తిగా, సాధికారంగా, పాఠకుడిని ఆనందపు టంచుల వరకు తీసుకెళ్ళగలుగుతారు. సరళమైన భాష, చిన్న చిన్న వాక్యాలు, వాడుక భాష ఉపయోగం, మన చుట్టూ జరుగుతోన్న సంఘటనల్లోంచి కథా ఇతివృత్తాన్ని ఏరుకోవటం -లాంటి ప్రత్యేకతలు రచయితను, బాహుళ్యంలోంచి విడదీసి చూపు తాయి. ఈ సంచికలోని 30 కథలు నీతిని గరుపుతాయి. పిల్లలను అద్భుతలో కాలకు తీసుకెళ్ళగలిగే, ఏనుగులు, ఎలుకలు, చీమలు, కోతులు, లేళ్ళూ, గుర్రాలు, చేపలు, మన భాషను మాట్లాడతాయి. జంతువులే కాదు, బియ్యపు గింజలు, మిఠాయిలు, బెలూన్లు, గడ్డివాములు, పూలు, పళ్ళు, వెదురు గంపలు లాంటి పిల్లల జీవితంలో తారసపడే నిత్య జీవిత వస్తువుల పరిచయాలు ఉంటాయి.






**ప్రతులకు:**
ఆర్.సి.కృష్ణస్వామి రాజు,22-4-71,
బ్యాంకు ,ఎంప్లాయిస్ కాలనీ,
అక్కరాంపల్లి పోస్ట్ తిరుపతి-517 501.
సెల్:9393662821

పిల్లల ఊహాశక్తికి దోహదపడే కథాంశాలతో వారిలో జిజ్ఞాస ఉత్సుకత పెంచే రాజు గారి ప్రయత్నం పిల్లలను కొత్త ఆలోచనల వేపు నడిపిస్తాయి.

స్థాలీపులాక న్యాయంగా రచయిత ఆర్.సి. కృష్ణస్వామిరాజు గారి “కటకటా మర్కటా!” లోని కొన్ని కథల్లోని ప్రత్యేకతలని వివరిస్తారు. అందరు మనుషులు ఒకేలా ఉంటారు. కాని ఒక మనిషిని పోలిన మరో మనిషి ఉండడు. అలాగే చెట్టుకున్న వేలాది ఆకులు ఒక ఆకును పోలిన మరో ఆకు ఉండదు. ఒక్కొక్కరు ఒకో రకంగ ఉన్నా అందరినీ కలుపుకుపోతేనే ఆనందం చిరునవ్వుతో చిన్న చిన్న సర్దుబాట్లు చేసుకుంటేనే వారితో కలిసిపోవటం సులభం అని రుజువు చేస్తారు ‘రెండాకులు’ కథలో. పాలుపొంగటం సహజం. అలా సహజం అని ఊర్కోకుండా పాలు పొంగకుండా’ కథలోని దీపక్‌లా ఆలోచించాలి. మిల్క్ ఓవర్ ఫ్లో డిటెక్టర్ (ఎం. ఓ.డి) లాంటిది పిల్లలు కూడా ఆలోచించి కనుక్కోవాలి అని ప్రేరేపిస్తుంది ఈ కథ. సమస్యలు రావటం సహజం. సమస్యలు వచ్చినపుడు భయపడకుండా ‘గుహలో గొర్రెలు’ కథలోని కుబేరుడిలా ఉపాయం ఆలోచించి సమస్యల్లోంచి బయటపడాలని చెబుతుంది ఈ కథ. మంచి బొమ్మలు పిల్లలకు అదనపు ఆకర్షణ.

సామెతలు, జాతీయాలు, భాష అందాన్ని రెట్టింపు చేస్తాయి. చెప్పదలుచుకున్న పది వాక్యాల విషయాన్ని పదిపదాల్లో చెప్పగలిగే ‘పొదుపు’ అలవడుతుంది. రాజుగారు తన కథల్లో ఇవి విరివిగా వాడి కథల అందాన్ని పెంచారు. నిడివిని తగ్గించారు. పిల్లల్లో భాషా పరిజ్ఞానాన్ని పెంచారు.

ఆశకు హద్దుండాలి. అమ్మమాట చెక్కర మూట, తియ్యటి పాల మీగడతిన్నంత ఆనందం, లోభికి లాభం కన్నా నష్టమే ఎక్కువ. అమ్మ చేసేంత సాయం తుమ్మ చేస్తుంది. తుమ్మకు తుమ్మే రక్షణ. మెత్తగా అడిగితే అన్నీ మంచి ఫలితాలే వస్తాయి. అమితంగా ఆశపడని వాడు అందరికంటే అదృష్టవంతుడు. ఇచ్చుటలో ఉన్న హాయి మరి దేనిలోనూ లేదు. చీమకు చక్కెర దొరికినట్లు- లాంటి వాక్యాలు పిల్లల భాషాభివృద్ధికి తోడ్పడుతాయి.

మొక్కయి వంగనిది మానై వంగదు. పిల్లల బాల్యావస్థలోనే వారిని మంచి దారివేపు మళ్ళించాలి. సంచికలోని కథలన్నీ పిల్లల్లో మంచి ఆలోచనలు పెంచుతాయి. నేటి ఈ బాలలను రేపటి బాధ్యతాయుత ‘పౌరులు’గా ఎదగటానికి సహకరిస్తాయి. బాల సాహిత్యానికి ఇలాంటి, మంచి చేర్పులు ముందు ముందు మరిన్ని రావాలి.



**- కూర చిదంబరం**
సెల్:8639338675

# ఎన్ని కల్చర్లో? అసలుదే లేదు!

“దేశంలో, ప్రపంచంలో కల్చర్లకు కొదవ లేదు. రోజు కొకటి, ఆ మాటకొస్తే గంటకొకటి పుట్టుకొస్తుంది” అంటూ ప్రారంభించాడు మా మిస్టర్ క్లీన్.

“అయితే ఏంటంట?” అన్నాం.

“సావధానంగా వినండి పిల్లలూ. ఇప్పటిదాకా బుక్ కల్చర్ వుండేది, ఇప్పుడు లుక్ కల్చర్ వచ్చింది అని అనేకమంది బాధపడిపోయారు. అనగా పుస్తకాలు చదవటం మానేసి సినిమాలు, సీరియల్స్ చూస్తున్నారు. అందువల్ల అనేక అనర్థాలు జరిగిపోతున్నాయి అనేవారు. అంతకుముందు హరికథలు వినేవారు. బుర్రకథలు వింటూ చూసేవారు. నాటకాలు, తోలు బొమ్మలాట ఇలా సవాలక్ష వుండేవి. అవన్నీ కనుమరుగైపోతున్నప్పుడు వాళ్ళు కూడా మీలానే మొత్తుకునేవారు కదా. అయినా ఎప్పటికప్పుడు సైన్స్ కొత్త వాటిని కనుక్కుంటుంది. ఒకప్పుడు సినిమా వుంది. అది మొదటి దెబ్బతీసింది. ఇప్పుడు టీ.వీ. వచ్చింది -మన ఇంట్లోకి. ఈ కథల్లో జీవితం లేదా? పుస్తకం చదవటానికే పరిమితం. మరి టీ.వీ.లూ, సినిమాలు ఎన్ని అన్నాను.

“అరే మేంగో. ఇక్కడ రహదారులు లేవు. అన్నీ దొడ్డిదారులే. రహదారులు పేరుకు మాత్రం వుంటాయి. అవన్నీ గుంతలతో వుంటాయి. వాన కురిసినా, కురవక పోయి నా అవి పాడయిపోతుంటాయి. అదేంటంటే మనుషులు పెరిగారు, వాహనాలు పెరిగాయంటారు” అంటుంటే?

“టాపిక్ డైవర్ట్ అవుతోంది. ఇప్పుడు పేపర్ లెస్ గవర్నెన్స్ వచ్చింది. అందుకని చెట్లు నరకపన్లా! అంతా వాయిస్‌లే కదా!” అన్నాడు విదూ.

“అవును. వాయిస్ పొల్యూషన్” అంది అన్య.

“ఇలా మాట్లాడుకోవటం కూడా కొత్త కల్చర్‌లా వుంది. అంటే మన గురూజీ చెప్పినట్లు ప్రతి గంటకూ కొత్త కల్చర్ వచ్చి చేరుతుంటుంది. ఇప్పుడు కల్చర్ లేదా సంస్కృతి అనగానేమి అనేవి మేధావులకు వదిలేద్దాం. మన గురూజీ ఏదో చెప్పటానికి ఈ డిస్కోర్స్ మొదలుపెట్టారు. అందుకని అయ్యవారిని మాట్లాడనిద్దాం” అన్నాను.

“అసలు విషయంలోకి వచ్చావురా అబ్బాయి. కొన్ని పదాలకు నిర్వచనాలు అడగకూడదు. ముఖ్యంగా పిల్లలు. తర్వాత మీకు ఒక్కోటి విన్నా, చదివినా ఫిట్స్ వస్తాయి. ఇంతకూ ఇది ఎందుకు మొదలుపెట్టానంటే అంగట్లో అన్నీ వున్నాయి, అల్లుడి నోట్లో శని వుంది అన్నట్లు అసలుదే లేదు. అది మిస్సయి పోతోంది.”

క్రాఫ్టుల వారు కలిసి పనిచేయాలి. ఇందులో సంగీతం వుంది. మనం చూడని ప్రాంతాలు చూడవచ్చు. ఇన్ని ప్రయోజనాలుంటే వీటి మీద దాడి ఎందుకు అంటారు మరికొందరు” అని ఊపిరి తీసుకోవటానికి ఆగాడు మా మెంటార్.

“బ్రీత్ లెస్ సాంగ్స్ కల్చర్ వచ్చింది కదా. మీరు అలుపు తీసుకోకుండా ఉపన్యాసం చెప్పవలసిన పని లేదు. తాపీగానే మాట్లాడండి. ఇంతకూ కల్చర్ అంటే ఏమిటి?” అని ప్రశ్నించింది అన్య.

“దాని గురించి మాట్లాడటం మొదలుపెడితే ఊపిరి ఆగిపోతుంది” అన్నాడాయన.

“ఎవరిది?”


“చెట్లది. దానిమీద చర్చించాలంటే వెయ్యి చెట్లని నరకాలి. అయినా ఏదీ తెలియదు. ఓ అంగీకారానికి రారు. ఎంతమంది మనుషులుంటే అన్ని కల్చర్స్ వున్నాయంటే ఒక్క మాటలో మీ ప్రశ్నకు సమాధానం ఇచ్చినట్లే!”

“నేను ఒక్కసారి చెబితే వంద సార్లు చెప్పినట్లే. నాది రహదారి” అని రజనీకాంత్ చెప్పినట్లే మీరు లక్ష ప్రశ్నలకు ఒక ఆన్సర్ చెప్పినట్లా?”

“ఏమిటది?”

“వర్క్ కల్చర్. ఈ ప్రపంచంలో అందరూ కవిత్వాలు రాస్తారు. కథలు- నవలలు, పాటలు రాస్తారు. నృత్యాలు చేస్తారు. అందులో సెంట్రల్ పాయింట్ శ్రమ. శ్రమైక జీవన సౌందర్యం, శ్రమతోనే అన్ని సంపదలు సృష్టిస్తారు. చెమట చుక్కలు నుండి ఆహాహా ఎన్నెన్ని వర్ణనలు. ఇప్పుడు కొన్ని పరిశ్రమలు, హోటళ్ళు, ఒక్కమాటలో ఏ రంగమైనా చూడండి-అక్కడ పనివాళ్ళ కొరత వుంది. అందుకని ఎన్ని రోజులుంటాయో, ఎప్పుడు మూతబడతాయో తెలియదు.”



**- పి.చంద్రశేఖర అజాద్**
92465 73575

“అవునవును. పని మనుషులు దొరకటం లేదు అని మా నాయనమ్మ వాళ్ళు మాటాడుకోవటం నేను విన్నాను” అంది అన్య.

“ఎవరి పనులు వారు చేసుకోవటం మానేశారు అన్యా. అది ఇంటి నుండి మొదలయింది. వ్యవసాయం ఎందుకు మానేస్తున్నారంటే పనివారు దొరకటం లేదంటారు. ఇళ్ళు కట్టుకునేవారు, చివరకు అన్‌లోడ్ చేయటానికి మనుషులు దొరకటం లేదు. మీరు నగరాల్లో వుంటున్నారు పల్లెలు వెళ్ళండి. అక్కడి పరిస్థితులు ఇంకా దారుణంగా వున్నాయి” అన్నాడు మిస్టర్ క్లీన్.

“ఇందుకు కారణం ఉచితాలా?” అడిగింది అన్య.

“ఉచితాలు ఎంతవరకు ఇస్తారు? నెలకు మూడు వేలు ఇస్తే సరిపోయిందా? లేదా సంవత్సరానికి ఎంత వస్తుంది? ఖర్చులెన్ని అవుతున్నాయి. ఇలాంటి లెక్కలు వేసుకోరా? ఆడుతూ పాడుతూ పనిచేస్తుంటే అలుపూ సొలుపూ వుండదు లాంటి పాటలు ఏమైపోయాయి. ఇదివరకు ఊరికి ఒకరిద్దరు సోమరిపోతులు వుండే వారు. ఇప్పుడు లెక్కలు తీయండి. అసలు ఇన్ని కల్చర్స్ వస్తుంది వర్క్ కల్చర్‌ని పెంచడానికి కదా. అదే దెబ్బతి న్నప్పుడు ఏ దేశమైనా ఎట్లా బాగుపడుద్ది నాయనలారా” అన్నాడు గురూజీ.

“పనికి ఆహార పథకంలో పని దినాలు పెంచమంటున్నారు కదా!” అంది అన్య.


‘మనవాళ్ళు మంచి మంచి పేర్లు పెడతారు. ఇది ఆహార పథకం. పనికి మాత్రం కాదు. ఇది ఎప్పుడు మొదలయింది. సరిగ్గా రెండు మూడు సంవత్సరాలు ఇందులో పనులు సక్రమంగా జరిగి వుంటే ఈపాటికి పల్లెల స్వరూపాలు మారిపోయి వుండేవి. ఇవన్నీ కొంతమందికి ఆహార పథకాలు. పిల్లలూ, స్కీములన్నీ బాగుంటాయి. ఏవీ అమలు కావు పూర్తిగా. అదే దౌర్భాగ్యం.”

“చివరిగా ఏం చెప్పదలుచుకున్నారు?” అన్నాను.

“బేవార్స్‌గా వచ్చేది ఏదీ మనకు తృప్తిని ఇవ్వదు. శ్రమ చేయకుండా బతకాలని మీరు కోరుకోవద్దు. ముసలితనం వస్తుంది. అప్పుడు శ్రమ చేయాలన్నా శరీరం సహకరించదు. అలాంటి వారికోసం సమాజం ఏదైనా చేయాలి. అంతేగాని ఈ ఉచితాలను మించిన దరిద్రపు కల్చర్స్ పోయినప్పుడే మామూలు మనుషులకు శ్రమలో ఎంత ఆనందం వుందో తెలుస్తుంది. ప్రస్తుతా నికి స్వస్తి” అన్నారు గురూజీ.

## ఒడి నుండి గుడి వైపు!

మట్టి వాసనలో మొదలైన నా ఊపిరి
మాటల వెలుగులో అర్థాన్ని వెతుక్కుంది
గడ్డి పరకలపై నడయాడిన అడుగులు
గ్రంథాల మధ్య గమ్యాన్ని వెతుక్కున్నాయి.
పల్లె నాకు బతకడం నేర్పిస్తే
అక్షరం ఎలా బతకాలో నేర్పింది.
ఒకటి ఆకలికి అర్థాన్ని చెబితే
మరొకటి ఆలోచనకు నాటు వేసింది.
బురదలో నడిచిన పాదాలే
పుస్తకాల పుటలపై పదాలై నడిచాయి.
ఒకటి ప్రకృతిని పరిచయం చేస్తే
మరొకటి ప్రకృతి పరమార్థాన్ని
తెలియచెప్పింది.
అమ్మ చేతి ముద్దలో
ప్రేమను రుచి చూశాను
పుస్తకాల పుటలలో
యావత్ ప్రపంచాన్ని గాలించాను.
నాన్న చెమట చుక్కల్లో
శ్రమైక సౌందర్యాన్ని చవిచూశాను
అక్షర బిందువుల్లో
జ్ఞానామృతాన్ని కనుగొన్నాను.
నా ప్రయాణం...
పల్లె ఒడి నుండి అక్షరాల గుడి వైపు.
ఇది నా జీవిత గాథలో
అత్యంత పవిత్రమైన యాత్ర.
మామూలు ప్రయాణం కాదు ఇది
మట్టిలో మొలిచిన ప్రతి మొక్క
జ్ఞాన కుసుమాలతో వికసించగలదనే
మానవ సంకల్పానికి చిరునామా.
పల్లె నాకు జన్మనిస్తే...
ఆ జన్మకు అర్థాన్ని ఇచ్చింది అక్షరం!
అందుకే...
నా చిరునామా అడిగితే
ఊరి పేరు చెప్పను...
నేను నేర్చుకున్న అక్షరాలనే
నేటి నా చిరునామాగా చూపిస్తాను.




**-ఆచార్య కడారు వీరారెడ్డి**
9392447007


# వేదవతి ప్రభాకర్‌కు సినారె సంగీత పురస్కారం

హైదరాబాద్, జులై 29: ప్రముఖ సాంస్కృతిక సంస్థ వంశీ ఇంటర్నేషనల్, సుశీలా నారాయణ రెడ్డి ట్రస్ట్ నిర్వహణలో విఖ్యాత కవి డాక్టర్ సి. నారాయణరెడ్డి జయంతి సందర్భంగా ప్రఖ్యాత గాయని వేదవతి ప్రభాకర్‌కు సినారె సంగీత పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం త్యాగరాయ గానసభలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి పాల్గొని సినారె మనువడు చైతన్య, మనుమరాలు ప్రశాంతితో కలిసి పురస్కారం బహూకరించి మాట్లాడారు. ఎక్కడో మారు మూల హనుమాజీ పేట గ్రామం నుంచి జాతీయ స్థాయికి సాహిత్యంతో ఎదిగిన నారాయణ రెడ్డి పండితుల్ని సామాన్య ప్రజలను తన కవితలతో పాటలతో మెప్పించారనీ చెప్పారు. పురస్కారం అందుకున్న వేదవతి ఆకాశవాణిలో లలిత గీతాలకు నాడు ఒక బ్రాండ్ అని కొనియాడారు. సభాధ్యక్షత వహించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత పత్తిపాక మోమన్ మాట్లాడుతు సంగీత సాహిత్య కళామూర్తి సినారె అన్నారు. వేదవతి సినారె రచించిన మీరా భజనలు మధురంగా గానం చేసి ప్రతి తెలుగు వారి ఇంటిలో నాడు నిలిచి పోయారని గుర్తు చేశారు. తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ నారాయణరెడ్డి తెలుగు భాషపై ఎంతో ప్రేమ అని, ఆయన నేటి యువత స్ఫూర్తి అని తీసుకుని తెలుగు వ్యాప్తికి దోహదం చేయాలి అని కోరారు. స్పందన తెలియచేస్తూ వేదవతి సినారె పాటలు ఆకాశవాణిలో ఎన్నో పాడాను అని గుర్తు చేసుకున్నారు. వంశీ రామరాజు స్వాగతం పలుకుతూ సినారె తమ సంస్థకి మేనమామ వంటివారు అని చెప్పారు. సుధామయి వ్యాఖ్యానంలో ప్రశాంతి, శశికళ, వినోద్‌బాబు, గీతాంజలి తదితరులు సినీ గీతాలు మధురంగా ఆలపించారు.



వేదవతి ప్రభాకర్‌ను సినారె పురస్కారంతో సత్కరిస్తున్న డా॥ కె.వి.రమణాచారి, వంశీరామరాజు, సినారె మనువడు చైతన్య, మనుమరాలు ప్రశాంతి







# 'యశోభూషణం' -ఒక వ్యక్తిత్వానికి అక్షరాభిషేకం

ఒక వ్యక్తి జీవితాన్ని అంచనా వేయడానికి వీరు సంపాదించిన పదవులు, పొందిన పురస్కారాలు మాత్రమే ప్రమాణాలు కావు. వీరి గురించి సమాజంలోని వివిధ వర్గాలకు చెందిన వ్యక్తులు వ్యక్తపరిచిన అభిప్రాయాలు, అతని వ్యక్తిత్వం కలిగించిన ప్రభావం, సాహిత్యానికి మరియు సమాజానికి చేసిన సేవలే నిజమైన కొలమానాలు. ఆ దృష్టితో చూస్తే ఎన్.వి. రఘువీర్ ప్రతాప్ గారి **'యశోభూషణం'** సాధారణ అభినందనల సంకలనం కాదు. ఒక వ్యక్తి నాలుగు దశాబ్దాల జీవన యానం, సాహిత్యసేవ, ఉద్యోగనిబద్ధత, మానవీయ విలువలకు లభించిన సామూహిక సాక్ష్యం.

ఈ గ్రంథాన్ని చదువుతుంటే ముందుగా కనిపించేది రఘువీర్ ప్రతాప్ వ్యక్తిత్వంలోని సహజత్వం. అటవీశాఖలో నలభై సంవత్సరాలపాటు వివిధ జిల్లాల్లో బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ చేసిన ఒక ఉన్నతాధికారి గురించి సహోద్యోగులు, సాహితీవేత్తలు, ఆధ్యాత్మిక ప్రముఖులు, స్నేహితులు, శిష్యులు, సన్నిహితులు ఒకే స్వరంతో గౌరవంగా మాట్లాడటం యాదృచ్ఛికం కాదు. అది వీరు సంపాదించుకున్న విశ్వాసానికి, నిష్కళంకమైన సేవకు ప్రతిబింబం.

ఒకవైపు పరిపాలనా బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూనే మరోవైపు సాహిత్యాన్ని జీవనధర్మంగా భావించడం రఘువీర్ ప్రతాప్ ప్రత్యేకత. కవిత్వం, సమీక్ష, వ్యాసం, గజల్, నానీలు, అనువాదం వంటి అనేక ప్రక్రియల్లో రచనలు చేసి పద్దెనిమిదికిపైగా గ్రంథాలను వెలువరించడం వెనుక నిరంతర అధ్యయనం, భాషపై ప్రేమ, సాహిత్యంపై అంకితభావం స్పష్టంగా కనిపిస్తాయి. తంగేడువనం వంటి తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించిన సంకలనాల్లో వీరి కవితలకు చోటు దక్కడం వీరి సాహిత్య ప్రతిభకు నిదర్శనం.

ఈ గ్రంథంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు వ్యక్తపరిచిన అభిప్రాయాలు చదువుతుంటే ఒక విషయం స్పష్టమవుతుంది. వారు కేవలం రచయితను పొగడటానికే రాయలేదు. ఆయనలోని మంచితనం, మానవత్వం, స్నేహశీలత, సేవాతత్వం, సాహిత్యాభిమానం, వ్యక్తిత్వ ఔన్నత్యాన్ని తమ అనుభవాల వెలుగులో ఆవిష్కరించారు. జగద్గురు స్వామీజీ నుండి విశ్వవిద్యాలయ ఆచార్యుల వరకు, సాహితీవేత్తల నుండి సన్నిహిత మిత్రుల వరకు ఎన్నో కోణాల్లో రఘువీర్ ప్రతాప్ గారిని పరిచయం చేయడం వల్ల ఈ గ్రంథం ఒక వ్యక్తి జీవితానికి సంబంధించిన సమగ్ర వ్యక్తిత్వ చిత్రంగా నిలిచింది.

నన్ను ప్రత్యేకంగా ఆకట్టుకున్న అంశం వీరి జన్మభూమిపై ఉన్న ప్రేమ. "ఆ కొమ్మకు పూచిన పువ్వునై" అనే కవితలో స్వగ్రామమైన కల్వకోలు పట్ల వ్యక్తపరిచిన అనుబంధం హృదయాన్ని తాకుతుంది. మనిషి ఎంత ఎత్తుకు ఎదిగినా తన మూలాలను మరచిపోకూడదనే విలువ ఆ పంక్తుల్లో ప్రతిధ్వనిస్తుంది. ఆ భావుకతే ఆయన కవిత్వానికి జీవం పోసిందనిపిస్తుంది. సాహిత్యసేవలో వీరి పాత్ర ప్రశంసనీయం. ధర్మకేతనం సాహిత్య కళాపీఠాన్ని స్థాపించి అనేకమంది సాహితీవేత్తలను సన్మానించడం, వారి సేవలను గుర్తించడం ద్వారా తాను మాత్రమే కాక ఇతరులను కూడా వెలుగులోకి తీసుకురావాలనే విశాల దృక్పథాన్ని ప్రదర్శించారు. నిజమైన సాహితీవేత్త తన రచనలతో పాటు ఇతరుల సాహిత్యాన్ని గౌరవించినప్పుడే సంపూర్ణుడవుతాడని వీరు ఆచరణ ద్వారా నిరూపించారు.

'యశోభూషణం' చదివాక నాకు కలిగిన భావన ఏమిటంటే ఇది ప్రశంసల పుస్తకం మాత్రమే కాదు. ఒక వ్యక్తి జీవితాన్ని విలువలతో ఎలా నిర్మించుకోవాలో చెప్పే ప్రేరణాగ్రంథం. ఈ పుస్తకంలోని ప్రతి రచన వెనుక రచయితల అనుభవం, ఆప్యాయత, గౌరవం ఉన్నాయి. అందుకే ఈ అభినందనలు కృత్రిమంగా అనిపించవు; సహజంగా హృదయాన్ని చేరుకుంటాయి. నేడు పదవులు, సంపదల కంటే మంచి పేరు సంపా దించడం ఎంతో కష్టమైన విషయం. రఘువీర్ ప్రతాప్ ఉద్యోగరంగంలోనూ, సాహిత్యరంగంలోనూ, సామాజిక సేవలోనూ సంపాదించుకున్న ఆ గౌరవమే ఈ 'యశోభూషణం'. వీరి జీవిత ప్రయాణాన్ని అక్షరాల్లో పదిలపరిచిన ఈ గ్రంథం భవిష్యత్తు తరాలకు ఒక స్ఫూర్తిదాయకమైన




దస్తావేజుగా నిలుస్తుందని నమ్ముతున్నాను. ఒక మంచి మనిషి గురించి ఎందరో మంచి మనసులతో రాసిన ఈ గ్రంథాన్ని చదివిన తర్వాత, నిజమైన యశస్సు అనేది బిరుదుల్లో కాదు, మనిషి హృదయాల్లో సంపాదించుకునే స్థానం అనే విషయం మరింత స్పష్టంగా అర్థమవుతుంది.

కొన్ని పుస్తకాలు చదివిన తరువాత మూసివేస్తాం. కొన్ని పుస్తకాలు మాత్రం మనసును మూసివేయనివ్వవు. అవి పుటలు దాటి మనతో సంభాషిస్తాయి. 'యశోభూషణం' అలాంటి గ్రంథమే. ఇది ఒక వ్యక్తి అభినందన గ్రంథం మాత్రమే కాదు. ఒక మనిషి జీవితం ఎన్ని హృదయాల్లో ముద్ర వేస్తే, ఆ ముద్రలు అక్షరాలుగా ఎలా వికసిస్తాయో చూపించే అరుదైన సాహిత్య సాక్ష్యం. ఎన్.వి. రఘువీర్ ప్రతాప్ గారి గురించి ఈ గ్రంథంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, సాహితీవేత్తలు, ఆధ్యాత్మిక వేత్తలు, సహోద్యోగులు, మిత్రులు, శిష్యులు రాసిన వ్యాసాలను చదువుతుంటే ఒక విషయం స్పష్టమవుతుంది. ఒక మనిషి గురించి ఇన్ని గొంతులు మాట్లాడినా, వాటి వెనుక వినిపించేది ఒక్కటే స్వరం ఆయనలోని మంచితనం. మంచి పదవిని సంపాదించడం కష్టం కాదు; మంచి పేరును సంపాదించడం చాలా కష్టం. ఆ మంచి పేరుకు అక్షరరూపమే 'యశోభూషణం' అనిపించింది. నలభై సంవత్సరాల పాటు అటవీశాఖలో ఉన్నత బాధ్యతలు నిర్వహించిన అధికారి ఒకవైపు ఉంటే, అదే మనిషిలో మరోవైపు ప్రకృతిని ప్రేమించిన కవి కనిపిస్తాడు. అడవుల్లో సేవ చేసిన చేయి, అక్షరాల్లోనూ పచ్చదనాన్ని నాటింది. చెట్లను కాపాడిన మనసు, పదాలను కూడా అంతే ప్రేమగా పెంచుకుంది. అందుకే వీరి కవిత్వంలో మట్టి వాసన ఉంటుంది చెట్ల నీడ ఉంటుంది మనిషి మీద నమ్మకం ఉంటుంది.

రఘువీర్ ప్రతాప్ సాహిత్య ప్రయాణాన్ని పరిశీలిస్తే అది ఒక్క ప్రక్రియకు పరిమితం కాలేదు. కవిత్వం, సమీక్ష, వ్యాసం, గజల్, నానీలు, భావరచనలు ఏ ప్రక్రియలో అడుగుపెట్టినా తనదైన ముద్ర వేశారు. రచన వీరికి అభిరుచి మాత్రమే కాదు; అది అంతరంగ స్వరాన్ని ప్రపంచంతో పంచుకునే సాధనమని ఈ గ్రంథం చెబుతుంది. పద్దెనిమిదికిపైగా గ్రంథాలను వెలువరించిన వీరిలో రచయిత కన్నా ముందు ఒక పాఠకుడు, ఒక సాధకుడు, ఒక విలువల మనిషి కనిపిస్తాడు. తన పుట్టిన ఊరిని తలచుకుంటూ రాసిన "ఆ కొమ్మకు పూచిన పువ్వునై" అనే కవితలో వ్యక్తమైన ఆత్మీయత చదివితే, కవి ఎంత ఎత్తుకు ఎదిగినా అతని వేర్లు మాత్రం తన మట్టిలోనే ఉంటాయని అర్థమవుతుంది. "మళ్లీ అవకాశమంటూ వస్తే ఆ మట్టితీగకే పువ్వునవ్వాలని" కోరుకునే హృదయం అరుదు. జన్మభూమిని కేవలం జ్ఞాపకంగా కాదు, జననికి కారణమైన తల్లిగా చూసే ఆ భావుకతే వీరి కవిత్వానికి శాశ్వతత్వాన్ని ఇస్తుంది.

ఈ గ్రంథంలో నన్ను ఎక్కువగా ఆకట్టుకున్నది ప్రశంసల పరిమాణం కాదు; వాటి ప్రామాణికత. ఒకే వ్యక్తిని గురించి జగద్గురువులు, పీఠాధిపతులు, విశ్వవిద్యాలయ ఆచార్యులు, సాహిత్య విమర్శకులు, కవులు, సహోద్యోగులు, మిత్రులు తమ తమ అనుభవాలతో చిత్రించడం వల్ల ఒక బహుముఖ వ్యక్తిత్వం మన ముందుకు వస్తుంది. ప్రతి రచన ఒక పుష్పమైతే, వాటన్నింటినీ కలిపిన హారమే 'యశోభూ షణం'. ప్రతి వ్యాసం ఒక అద్దమైతే, ఆ అద్దాలన్నింటిలో ప్రతిఫలించిన రూపమే రఘువీర్ ప్రతాప్ గారి వ్యక్తిత్వం. ఆ సంస్కారానికి ఈ గ్రంథం నిశ్శబ్ద సాక్షి.

ఈ పుస్తకంలోని ప్రతి పేజీ ఒక జ్ఞాపకం. ప్రతి జ్ఞాపకం వెనుక ఒక అనుబంధం. ప్రతి అనుబంధం వెనుక ఒక విశ్వాసం. అందుకే ఈ గ్రంథాన్ని చదువుతున్నప్పుడు ప్రశంసల కంటే ప్రేమ ఎక్కువగా కనిపిస్తుంది; బిరుదుల కంటే బంధం ఎక్కువగా కనిపిస్తుంది; అధికారిక జీవితం కంటే మానవీయ జీవితం ఎక్కువగా కనిపిస్తుంది. ఒక మనిషి విజయాన్ని అతను రాసిన పుస్తకాలతో మాత్రమే కాదు, అతని గురించి ఇతరులు ప్రేమతో రాసిన పుటలతో కూడా కొలవవచ్చని ఈ గ్రంథం నిరూపిస్తుంది. నిజానికి యశస్సు అనేది మనం ప్రకటించుకునేది కాదు; ఇతరులు మన కోసం మౌనంగా మోసుకొచ్చే గౌరవం. భూషణం అనేది మనం ధరించేది కాదు; మన వ్యక్తిత్వానికి సమాజం అలంకరించేది. ఆ రెండూ కలిసినప్పుడే 'యశోభూషణం' అనే శీర్షిక సంపూర్ణార్థాన్ని సంతరించుకుంటుంది.

ఈ గ్రంథాన్ని చదివిన తరువాత నాకు అనిపించింది ఒక్కటే-జీవితాన్ని విజయవంతంగా గడపడం గొప్ప విషయం కావచ్చు; కానీ జీవితాన్ని విలువైనదిగా మార్చుకోవడం అంతకంటే గొప్ప విషయం. పదవీ విరమణ అనేది ఉద్యోగానికి ముగింపు మాత్రమే; మంచి మనిషిగా సంపాదించుకున్న గౌరవానికి ఆరంభం. ఆ గౌరవాన్ని అక్షరాల్లో నిలిపిన సాహిత్య స్మారకమే 'యశోభూషణం'. ఒక దీపం వెలుగుతుంటే దాని చుట్టూ ఎన్నో దీపాలు వెలుగుతాయి. ఒక వృక్షం పెరిగితే దాని నీడలో అనేకమంది సేదతీరుతారు. అలాగే ఒక మంచి మనిషి జీవిస్తే అతని గురించి రాయడానికి ఎన్నో కలాలు ముందుకు వస్తాయి. ఆ కలాల సమిష్టి వెలుగుతో రూపుదిద్దుకున్న గ్రంథమే 'యశోభూషణం'. ఈ గ్రంథం రఘువీర్ ప్రతాప్ గారి వ్యక్తిగత కీర్తికి మాత్రమే కాదు; మంచితనం, సాహిత్యనిబద్ధత, మానవీయ విలువలకు అంకితమైన అక్షరార్చనగా చిరస్థాయిగా నిలిచి ఉంటుంది. యశస్వి రఘువీర్ ప్రతాప్ యశోభూషణం" గ్రంథం విలువ కూడా ఇక్కడే ఉంది. ఇది ఒక వ్యక్తిని పొగిడే గ్రంథం కాదు; ఒక వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకునే గ్రంథం. ఇది సన్మాన సంచిక కాదు; సంస్కార సంచిక. ఇది జ్ఞాపకాల సంకలనం మాత్రమే కాదు; విలువల వంశవృక్షం. ఇందులోని ప్రతి వ్యాసం ఒక పుష్పమైతే, వాటన్నింటినీ కలిపే పరిమళం రఘువీర్ ప్రతాప్ గారి మానవీయత. ప్రతి రచయిత ఒక కోణాన్ని చిత్రించినా, ఆ కోణాలన్నింటినీ కలిపి చూసినప్పుడు కనిపించేది ఒక సంపూర్ణ జీవన తత్వం.

కాలం ముందుకు సాగిపోతుంది. తరాలు మారిపోతాయి. పదవులు మారతాయి. అధికారాలు మారతాయి. కానీ విలువలు మారవు. మంచితనం పాతబడదు. మానవీయతకు గడువు ఉండదు. సాహిత్యానికి మరణం ఉండదు. అందుకే రఘువీర్ ప్రతాప్ గారి జీవితం కూడా ఒక వ్యక్తిగత జీవితంగా ముగియదు. అది ఒక నిరంతర స్ఫూర్తిగా ముందుకు సాగుతుంది. అడవిలో ఆయన నాటిన మొక్కలు పచ్చదనాన్ని కాపాడినట్లే, ఆయన నాటిన ఆలోచనలు మన సంస్కృతిని, మన సాహిత్యాన్ని, మన మానవీయతను సజీవంగా ఉంచుతాయి.

రఘువీర్ ప్రతాప్ గారిని ఒకే వాక్యంలో నిర్వచించాలంటే.. వీరు ఒక అధికారి కాదు. బాధ్యతకు ప్రతిరూపం. వీరు ఒక రచయిత కాదు. ఆలోచనకు ఆవాసం. వీరు ఒక సాహిత్యాభిమాని కాదు. అక్షర సంస్కృతికి ఆరాధకుడు. వీరు ఒక మంచి మనిషి మాత్రమే కాదు; మంచితనాన్ని జీవించిన మనిషి. అందుకే వీని పేరు ఒక వ్యక్తిని సూచించదు. ఒక విలువను సూచిస్తుంది. ఒక సంస్కారాన్ని సూచిస్తుంది. ఒక జీవన తత్వాన్ని సూచిస్తుంది.కాలం ఎన్నో పేర్లను తన పుటలపై రాస్తుంది. కొన్ని పేర్లను చెరిపేస్తుంది. మరికొన్ని పేర్లను మాత్రం శిలాశాసనాల్లా చెక్కుకుంటుంది.



-శైలజామిత్ర
9290900879

## 'అంచనాల అగ్నిలో దహనం కాబోకు"

ఆశల పర్వతాల కింద నలిగిపోతున్న భుజాలు,
టార్గెట్లకు సమిధై వేగిపోతున్న యవ్వనం.
"టాప్ రావాలి", "జాబ్ రావాలి", "పేరు రావాలి"
ప్రతి శ్వాసకు ఒక గడువు... శ్వాసే ఆగిపోయేలా!.
సెల్ స్క్రీన్ లో వెయ్యి నవ్వులు,
నిజ జీవితంలో ఒంటరి నిశ్శబ్దం.
చెప్పుకుంటే "వీక్" అంటారనే భయం,
దాచుకుంటే లోపల సుడిగాలి.
అలసిపోతే కాస్సేపు ఆగు...
ఆగిపోయి నీ గుండె చప్పుడు విను.
నీవు యంత్రానివి కాదు,
అలసటను రీఛార్జ్ చేసుకుని
విజృంభించాల్సిన మనిషివి.
అంచనాల అగ్నిలో దహనం కాబోకు!
గుర్తుంచుకో,
వజ్రం కూడా ఒత్తిడిలోనే మెరుస్తుంది.
నీ కన్నీళ్లు బలహీనతకు గుర్తు కాదు,
నీలోని భావనాతరంగాల బలానికి అవే సాక్ష్యాలు.
ఈ ఒత్తిడి నిన్ను చంపడానికి రాలేదు,
నిన్ను తట్టి లేపడానికి వచ్చింది.
కాబట్టి ధీమాగా తలెత్తుకో...
నీ కథ ఇంకా మొదలు కానే లేదని గ్రహించుకో!
ఓడిపోయినా భయపడకు,
ఆ ఓటమే నీకు గెలుపు పాఠమని తెలుసుకో
బూడిద నుండి తిరిగి లేచే ఫీనిక్స్ లా,
రెట్టింపు తెగువతో రెక్కలు విప్పుకో!
పడిన ప్రతిసారీ నీలో ఉత్సాహం
వెయ్యి రెట్లు ఉరకలెత్తాలి.
ఎందుకంటే...
నీవు ఆగిపోవడానికి పుట్టలేదు,
రగిలిపోయి అనుకున్నది సాధించడానికే పుట్టావు.

-నరహరి రావు బాపురం
అనంతపురము



## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

## 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ



## "ధైర్యమే దిక్సూచి"

ఓ యువతా!
మార్కుల మేఘాలు మనసున ముసరగా
నవ్వులు మాయమై మౌనం క్రమ్ముకొనగా
అలసిన ప్రాణంతో జీవితమే పోరాటంగా
ఒత్తిడి తలుపు తట్టిన ప్రతిసారీ కృంగిపోకు నీరసంగా
ఆత్మీయ పలకరింపు కరువై మిగిలిపోకు ఒంటరిగా
అలమటించకు అగచాట్లతో నిస్పృహగా
ఓ యువతా! అడుగు ముందుకేయ్ ఆశాదీపంగా
క్రమం తప్పక చేసుకోవాలి ధ్యానం యోగా
సరిపడా నిద్రతో మారుతుంది ఆరోగ్యం మెరుగుగా
మానసిక ఆరోగ్యం పెంచుకోవాలి తప్పని సరిగా
నిపుణుల సహాయం తీసుకోవాలి ప్రధాన మార్గంగా
వినియోగించుకో సామాజిక మాధ్యమాన్ని పరిమితంగా
ప్రతి ఉదయం కొత్త ఆశగా
ప్రతి అపజయం కొత్త పాఠంగా
ధైర్యమే నీ దిక్సూచిగా
నమ్మకమే నీ బలంగా
చీకటి దాటిన వెలుగే నీ గమ్యంగా
పంచుకో భావాలను వివేకంతో పూర్తిగా
మారిపో నీ శక్తికి నీవే సాక్షిగా
ఒత్తిడిని జయించి, జీవితం గెలుచుకో విజేతగా.

-సింగీతం విజయలక్ష్మి
చెన్నై

## మానసిక ఒత్తిడిలో యువత

మానసిక ఒత్తిడి - ఓటమి కాదు,
మరో అడుగుకు ఆహ్వానం
ఒత్తిడి లేని జీవితం లేదు...
ఒత్తిడికి లొంగని మనసే గొప్పది.
నేటి యువత భుజాలపై
కలల బరువుంది...
బాధ్యతల భారముంది...
అయినా ఆ భారాన్ని మోయగల
అపారమైన శక్తి కూడా వారిలోనే ఉంది.
ఒకప్పుడు...
అమ్మమ్మ చెప్పిన కథలు,
నానమ్మ పలికిన ముద్దు మాటలు,
"ఇదీ గడిచిపోతుంది బిడ్డా..."
అనే ఒక్క మాటే
మనసుకు ఓ ఔషధంగా నిలిచేది.
ఇప్పుడు...
మనసును అర్థం చేసుకునే విద్య ఉంది...
సలహా కేంద్రాలు ఉన్నాయి...
ధ్యానం ఉంది...
పుస్తకాలు ఉన్నాయి...
చేయూతనిచ్చే మనుషులు కూడా ఉన్నారు.
వారు నాటుతున్నది
నిరాశ అనే విత్తనం కాదు...
ఆశ అనే జీవబీజం.
ఆ విత్తనం
ఈరోజే మొలకెత్తకపోవచ్చు...
కానీ ఓర్పు అనే వర్షం కురిస్తే,
నమ్మకం అనే వెలుగు ప్రసరిస్తే,
అది ఒకరోజు
మహావృక్షమై నిలిచి
ఎన్నో జీవితాలకు నీడనిస్తుంది.
యువతా...
నీకు మానసిక ఒత్తిడి ఉందని
నీవు బలహీనుడివని కాదు.
దానిని ఎదుర్కొనే ధైర్యం,
దాటుకుని నిలబడే సామర్థ్యం,
మళ్లీ చిరునవ్వుతో
ముందుకు సాగే శక్తి
నీ అంతరంగంలోనే ఉంది.
పడిపోవడం సహజం...
మళ్లీ లేవడం కూడా సహజమే.
ఎందుకంటే...
నీ జీవిత కథకు ముగింపు రాసేది
మానసిక ఒత్తిడి కాదు...
నీ ఆత్మవిశ్వాసం...
నీ పట్టుదల...
నీ ధైర్యమే.

-శ్రావణి

## పోటీ ప్రపంచంలో

నవనాగరిక సమాజంలో
ఉరుకుల పరుగుల జీవితంలో
కనుమరుగై పోయింది ప్రశాంతత
తప్పటడుగులు వేస్తోంది యువత .
చదువు జ్ఞానం కోసం కాకుండా
ధనార్జన కోసం మాత్రమే అన్నట్టు
ఆలోచిస్తోంది నేటి నవ యువత
డిగ్రీల పట్టాల విలువ నానాటికి క్షీణిస్తోంది.
రాంకుల రంగుల రాట్నంలో
గిర గిరా తిరుగుతోంది సమాజం...
పొరుగు వారితో పోటీ పడటంలో
ముందుంటోంది సమాజం...
తల్లిదండ్రులు తమ తమ పోకడలకోసం
పిల్లలపై తెస్తున్నారు వత్తిడి...
విద్యాలయాలు తమ లాభాలకోసం
విద్యార్థులపై తెస్తున్నాయి వత్తిడి....
విద్యా సంస్థలు, తల్లిదండ్రులు పెట్టే
మానసిక వత్తిడి భరించలేక
తప్పు దోవపడుతోంది నేటి యువత
తీవ్ర వత్తిడివల్ల కొత్త ఆలోచనలతో
వ్యసనాలకు బానిసలౌతోంది యువత
తల్లిదండ్రులకు చివరకు మిగులుతోంది
కలత .
యువతలో పెరుగుతున్న మానసిక
వత్తిడులే. అనర్థాలకు వేస్తున్నాయ్ బాట
జీవితాలు పడుతున్నాయి ముళ్లబాట .
నేటి విద్యా బోధనలో అందిస్తున్నారు
కేవలం పుస్తక జ్ఞానం...
యువతలో పెరగడం లేదు లౌకిక జ్ఞానం
మరుగున పడుతోంది ఆత్మ విశ్వాసం
కనుమరుగై పోయింది మనో నిబ్బరం .
ప్రతీ చిన్ని విషయానికి
మెదడులో
కలుగుతోంది ఉద్రేకం..
నేటి యువతలో
లోపించింది వివేకం
బాల్యములోనే ఇవ్వాలి
మానసిక శిక్షణ
అదే అవుతుంది
యువతకు రక్షణ...!!

-లక్ష్మీ పద్మజ దుగ్గరాజు
భాగ్యనగరం




# దండము పద్యవిద్యకున్

పద్యాన్ని నేర్చుకోవటం ఒక యోగం. ఒక ధ్యానం. సుధాస్రోతస్వినీ స్నానం అని చెప్పి పద్యం నోటికి వచ్చిన తర్వాత **"నకలోర్విన్ కొనగోట ఎత్తినటులుత్సాహంబు ముంచెత్తెడిన్"** అంటూ నిలువెల్లా పులకిస్తూ భాష కౌగిట మురిసి పోయారు కవితా కృషివలురు డా॥ గరికపాటి. **"పద్యమ్మునోవడురా పాతి పెట్టెదనంచు ఉన్మాదియై విర్రవీగువాడు"** అని విరుచుకు పడ్డారు డా॥ కడిమిళ్ళ అవధాని గారు. అసలు అలవాటైతే పద్యమే అసలైన మద్యం అన్నారు. వై.ఆర్.గాంధీగారు నూటపద హార్లు కవితా సంకలనంలో, పద్యం కూడా ఒక వ్యసనమే. అది కూడా మత్తును కలిగిస్తుంది. చదువుతూ, వింటూ తల అటు ఇటు ఊపుతాం. అదొ ఉత్తమ వ్యసనం. పద్యం హృద్యమై కవన దేవి సాన్నిధ్యాన్ని పొందింది.

అక్షర రమ్యతతో నన్నయగారు అందించిన మహాభారత పద్యాల నుండి నేటి వరకు ఆ సంప్రదాయాన్ని అంది పుచ్చుకున్న నేటి పద్య కవుల వరకు పద్యాన్ని అందంగా అందించారు. వెయ్యే ళ్ళ సాహిత్య చరిత్రలో పద్యంలో మునిగితేలాం. పాల్కురికి సీస పద్యాలలో దేశి కవితను, తిక్కన గారు ఆంధ్రావళి మోదముం బొరయునట్లుగా ప్రతిపర్వ రసోదయంగా ప్రబంధ మండలి నందించారు. నవీన గుణసనాథుడు నాచన సోమనాథుడు ఉత్తర హరివంశాన్ని పద్యాలతో రసరమ్యంగా తీర్చిదిద్దారు. పోతన పరమభక్తుడై వేదాంత తత్త్వానికి శబ్దాలంకారాల సొగసు లద్దాడు. శ్రీనాథుడు పద్యాన్ని పల్లకీ ఎక్కించి కమలేందీ వరషండ మండిత లస త్కాసారాల వెంబడి తిప్పితే పెద్దనగారు హిమాలయ సానువులపై అంబర చుంబి అన్నట్లుగా నిలిపారు. కృష్ణదేవరాయులు హరిగుడిని ఎంత అందంగా వర్ణించారో వరి మడిని కూడా అంతే అందంగా వర్ణించారు. అష్టదిగ్గజ కవులు పద్యాన్ని అంబారీల మీద ఊరేగించారు. పద్యం తంజావూరు వెళ్లి విజయవిలాసంతో కులికింది.

మధునాపంతుల వారికి పద్యం పురాణ మైంది. గడియారం, దుర్భాక కవులకు చారిత్రకమైతే వానమామలై వారికి జీవన కావ్యమైంది. రాయప్రోలు జడకుచ్చు లుగా, కృష్ణశాస్త్రి ఊర్వశిగా, తెనుగులెంక రాష్ట్ర గానంగా, కొడాలి హంపీక్షేత్రంగా, ఇంద్రగంటి దక్షారామదర్శనంగా, జాషువాకి మాతృభాషగా, దాశరథికి అమృ తాభిషేక మైన పద్యం కడిమిళ్ళకు అమృతవర్షిణి అయి ంది. బేతవోలువారికి కొత్త గోదా వరైన పద్యం గరికిపాటి కవిని సాగరఘోషతో ముంచెత్తింది. ధరోజీ రావుగారికి ఆనందమ్మో హిని అయిన పద్యం గుబ్బల మాధవమూర్తి గారికి సరసవినోద నైంది. జొన్నవిత్తుల వారికి తెలు గువేదమైంది. పద్యం రాజ్యమేలిన కాలం అనడానికి వీలులేదు. పద్యం నిత్యం రాజమేలు తూనే ఉంది. పద్యం తెలుగువారి శ్వాస, అందులోని లయను ఆస్వాదించటమే ఆనంద ఆలోచనామృతాల ధ్యాస. ఛందస్సులో ఒదిగి లయ విన్యా సం చేసే పద్యం ఏ భాషనైనా ఏ యాసనైనా హాయిగా స్వీకరిస్తుందనటానికి చెరువువారి సుబ్బలచ్మిని శృంగార జానపద నేపథ్య పద్యాలుగా మనం చూపవచ్చు. ఏ భాష పలుకైనా ఏ యాస చెణుకైనా మన భాషలో హాయిగా కలుస్తా యంటారు కవులు.



ప్రతులకు:
శ్రీమతి పి. ఉషారాణి,
ఇ.నెం. 104-6-104,
ఎం.జి. స్ట్రీట్, రామకృష్ణానగర్
రాజమహేంద్రవరం-533 101. సెల్: 9989223245




అటువంటి తెలుగు సాహిత్యాన్ని ప్రవృత్తిగా మలుచుకుని ఇప్పటికి యాభై పుస్తకాలు రచించి ప్రచురించిన విద్వత్కవి, రచయిత శ్రీ ఎస్సార్ పృథ్విగారు. ఆయన స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఉద్యోగంతో సమాజానికి సేవలందించారు.

పద్యంపట్ల మమకారాన్ని పెంచుకొని యుద్ధము, ఇంద్ర ధనుస్సు అను లఘు పద్యకావ్యాన్ని రచించారు. **"వేమన కవీంద్ర! వింటివా వింతలెల్ల!!"** మకుటంతో ఈ శతకాన్ని పద్య ప్రియులకు అందిస్తున్నారు. అధ్యయనం, రచన ఆయన దినచర్య. ఇది ఆయనకు ఎంతో ఆనందాన్నిస్తున్న అంశం. అలా రాసిన వాటిని పాఠకులకు అందించాలన్న తపన ఈ పుస్తక రూపంలో మన ముందుకు వచ్చింది. చాలా తేలికగా హాయిగా ఉన్న పద్యాలను ఒకసారి ఆస్వాదించండి.

**"భాషయన్ననది జనుల భాగ్య తరువు**
**తెలుగు భాష గొప్పతనం తెలుపు వారు**
**జాతి మకుటమై నిల్చును జగతిలోన!!"**

అదే ఆయన ఆశయం, ఆ వినయమే సాహిత్యాధ్య యనానికి, సృజనకు కారణమౌతుంది. మరిన్ని ప్రేరణాత్మక రచనలు వారి నుండి వెలువడాలని ఆకాంక్షిస్తు న్నాను.

**కవిత్వం అంటే ఒక అన్వేషణ!**
**ఒక ప్రయాణం!**
**ఒక మానస సంచారం!**
**ఒక మౌన తపస్సు**
**ఒక అక్షర భావ నిధానం!!**
**నమస్సులతో..**




**-డా॥తలారి వాసు**

(ఎస్.ఆర్,పృథ్వీ రచించిన **'అనేకం'** పుస్తకానికి డా॥ తలారి వాసు రాసిన ముందు మాట )

# పోతన గజేంద్ర మోక్షము- వివరణ

పుస్తక సమీక్ష



ప్రతులకు:లోకేష్ ప్రచురణలు
నెం.2-711/2, షాహుకారఖ బంగ్లా వీధి,
కొంగారెడిపల్లి, చిత్తూరు-517 001
సెల్: 9908441523.

భగవంతుని లీలలు తెలుపు నది భాగవతము. హైందవ ధర్మ ములో అంతిమ మజిలీ మోక్ష ప్రాప్తి. అట్టి మోక్ష ప్రాప్తికి భగవంతుడు నిర్దేశించిన మార్గమును మనసా వాచా కర్మణా అనుసరించుట సరియైన పద్ధతి. దీనినే భక్తి మార్గము అని అంటారు.

వేల ఏళ్ళ క్రితము వేద వ్యాస మహర్షి సంస్కృతంలో భాగవతాన్ని వ్రాసాడు. ఒకనాడు సంస్కృత భాష ప్రాచుర్యములో ఉండినది. భారత ప్రజలు అర్థము చేసికునేవారు.కాలక్రమేణా ఇతర భాషలు దేశమున ప్రబలి సంస్కృతము వాడుక భాషగా దూరమయింది.

వ్యాసుని భాగవతము జన బాహుళ్యమునకు అర్థము అగునట్లుగా తెలుగులో బమ్మెర పోతన (1450-1510) **"శ్రీ మహదాంధ్ర మహా భాగవతమును"** వ్రాసినాడు.

పోతన బమ్మెర (వరంగల్లు జిల్లా) నివాసి. ఈతని భాగవత తెలుగుసేత పండిత పామరులకు అర్థము అగునట్లు ఉండుట చేత. చదువను, రాయలేని వాడైనను, నిత్య జీవితములో ఒకటో రెండో పోతన భాగవతములోని పద్యాల ను సందర్భానుసారముగా ఉటంకించుతాడు.

తెనుగు భాగవతములో 12 స్కంథములు (అధ్యాయ ములు) సుమారు 9000 పద్యములున్నవి. ఇందు దశావతారములు మరియు ఉపకథలుగా గజేంద్ర మోక్షణ అంబరీషోపాఖ్యానము, రంతి దేవుని చరిత్ర, కుచే లోపాఖ్యానము లాంటి భగవంతుని లీలలు తెలుపు ఉపాఖ్యానాలు ఉన్నవి.

ఈ ఉపాఖ్యానాలన్నింట.. గజేంద్రమోక్షణ కడు రమ్యమైన ఉపాఖ్యానముగా భావించబడుతుంది. 142 పద్యములతో అలరారే ఈ ఉపకథలో త్రికూటమను పర్వతము దగ్గరున్న ఒక కొలనులోకి ఒక గజరాజు తన భార్యలతో వచ్చి అక్కడి సరోవరంలో ఇచ్ఛా వచ్చినట్లు విహరిస్తూ ఉంటే, ఆ కొలనులోని మొసలి చీకాకు చెంది గజరాజు పాదమును కరిచి పట్టుకుంటుంది. గొప్ప పరాక్రమము గల కరి, స్థానబలముకల మకరి, రెండూ పెక్కేండ్లు పోరాడుతాయి.

తన బలము క్షీణించుతున్నదని గ్రహించిన ఆ గజరాజు విష్ణుమూర్తిని ప్రార్థిస్తాడు.

కొంత తడవు ప్రార్థనానంతరం విష్ణుమూర్తి, తన అంతఃపురమున లక్ష్మీదేవితో సరససల్లాపము లాడుచున్నను, హుటాహుటిన సరస్సు దగ్గరకువచ్చి తన చక్ర ప్రయోగముతో గజరాజును రక్షిస్తాడు. శాపవశమున మొసలియైన 'హూహూ' అను గంధర్వుడు శాపముక్తుడవుతాడు. విష్ణువు పూనికచే కరికి, మకరికి ఇరువురకును మోక్షప్రాప్తి కలిగినది.

ఆంధ్రీకరించిన భాగవతములోని ఉప కథలన్నింటిలోను గజేంద్రమోక్షణలోని పద్యాలన్నియు భావస్ఫోరకములు. ప్రజల నాలుకలపై నర్తించునవి. మానవుని (గజరాజు) సంసార బంధాన్ని (మొసలి పట్టు) త్రెంచుకున్నాకే (విష్ణువు కరుణ) అతనికి మోక్షప్రాప్తి అవుతుందన్న గొప్ప ఆధ్యాత్మిక సందేశము ఉంది.

ఈ ఉపఖ్యానములోని ఎన్నో పద్యాలు - ఎవ్వనిచే జనించు, లావొక్కింతయు లేదు. అల వైకుంఠపురంబులో, సిరికిం జెప్పదు, కలడందురు దీనుల యెడ, తన వెంటన్‌సిరి, లచ్చివెంట నవరోధవ్రాతము' లాంటి 'పాపులర్' పద్యాలు, నీరాట వనాటములకు పోరాటం బెట్లు కలిగె, ఖిల్లీ ఖిల్ల లూలాయక, లోకంబులు, లోకేషులు, లోకస్థులు తెగిన తదినలాంటి ప్రాస పద్యాలు వీనులకు విందు మనసుకు పసందు చేస్తాయి.

శ్రీమతి టి.శాంతాదేవి శాంతాభాస్కర్ అన్న కలం పేరుతో భారత భాగవతాల లోని ఔన్నత్యము గొప్పతనము పద్య మాధుర్యము విద్యార్థుల స్థాయికి అర్థమయ్యేలా పుస్తకాలను వ్రాసి మనకు అందిస్తున్నారు.

స్వతః ఉపాధ్యాయురాలు అవటం వల్ల జన బహుళ్యానికి అర్థం అయ్యేలా వివరించటం వారికి నల్లేరు మీది నడక. భాగవతం యొక్క గొప్పతనం (పే1) భాగవతం ఎందుకు చదవాలి (పే1) గజేంద్ర మోక్షణోపాఖ్యానం చదువరికి ఏమి సందేశం ఇస్తుంది? (పే2) ఆలు మగల బంధం ఎలా ఉండాలి (పే7) ఎలా ప్రయత్నిస్తే భగవంతుడి సాయం అందుతుంది (పే13) ఆపదలో ఉన్న వారిని అన్నీ మరిచి, అన్నీ వదిలి భగవంతుడు ఎలా పరుగు పరుగున వస్తాడు- అన్న విషయాలను 24 పేజీలు గల ఈ చిన్ని గ్రంథంలో వివరించారు. పౌరాణిక గాథాసక్తులకు మంచి చేయూత.

గజేంద్ర మోహణం. పోతన భాగవతంలోని కొన్ని పద్యాలకు వివరణ.



**- కూర చిదంబరం**
సెల్:8639338675

# నూరు వెన్నెల భానూరువాస శతకం

(డా॥ భోగయ్యగారి చన్ద్రశేఖర శర్మ రచించిన శ్రీ బానూరు వాస శతకం పుస్తకానికి అమ్మంగి వేణుగోపాల రాసిన ముందు మాట)

సుమతీ శతక కారుడు కందాలలో, యధావాక్కుల అన్నమయ్య వృత్తాలతో తొలి శతకాలు రచించారని పరిశోధ కులు చెప్తుంటారు. శైవమతావ యాయులకు పాల్కురికి సోమన 'వృషాధిప శతకం ' పరమ పూజ్యం. తెలంగాణ సాహిత్య చరిత్రకు సంబంధించినంత వరకు సోమన **'బసవ పురాణం'** తొలి కావ్యమైనట్లే. వృషాధిప శతకం తొలి శతకం అవుతుంది. శేషప్ప కవి నరసింహ శతక పద్యపాదం 19వ శతాబ్దపు గురజాడ కన్యాశుల్క నాటకంలో ప్రస్తావనకు వస్తుంది. సి.పి. బ్రౌన్ వంటి విదేశీయులు మన శతక పద్యాలను సేకరించటమే కాదు, వాటిని ఆంగ్లంలోకి అనువదిం చారు కూడా. వేమన పద్యాల ఆధారంగా ఇప్పటికీ తీర్పులు చెప్పుకుంటున్నారని, వేమన పద్యాలను మంత్రాలుగా ఉచ్చరిస్తూ పెళ్ళిళ్లు జరిపిస్తున్నారని ఎంత మందికి తెలుసు? 'శతకం' తెలుగుకే కాదు, సంస్కృతం, కన్నడం వంటి భాషల్లో కూడా ఉంది.

మకుటం, సంక్యానియమం అన్న ప్రధాన నియమాలతో పాటు శతకానికున్న మరో లక్షణం ముక్తక స్వభావం. శతకంలోని ఒక మరో పద్యానికి సంబంధం లేకపోవడం. అగ్ని పురాణంలోని 'ముక్తకం శ్లోకమే కైకః' అన్న భావమే తెలుగు కవులకు కూడా ఆదరనీయమైంది. తెలుగు ప్రాచీన కవిత్వంలోని చాటువులు తొలి ముక్తకాలు. వేములవాడ భీమకవి, శ్రీనాథుడు చెప్పిన చాటువులు ప్రఖ్యాతి గాంచినవి చాటువుల లక్షణాలు క్రమంగా శతక పద్యాలకు కూడా ప్రాకినాయి. కావ్యం చదివి, ఆస్వాదించి దానిమీద అభిప్రాయం చెప్పటానికి కొన్ని వారాలైనా పట్టవచ్చు. కాని శతకంలోని ఒక గట్టి పద్యం ఆ కవి ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తుంది. ఈ కారణంగా శతక కవులు ప్రాచుర్యం పొందుతూ వచ్చారు. శతక సాహిత్యంలో నీతి శృంగార భక్తి వైరాగ్య శతకాలే ఉన్నాయని సాధారణంగా భావిస్తుం టారు. కాని అధిక్షేప, హాస్య, చారిత్రక, తత్త్వశాస్త్ర శతకాలు కూడా ఉన్నాయి. ఎన్ని ఉన్నా- నీతి శతకం పొందినంత ప్రాచుర్యం మరే శతకమూ పొందలేక పోయింది.

ఈ నేపథ్యంలో సాహితీమిత్రులు శ్రీ భోగయగారి చంద్రశేఖర శర్మగారు రచించిన 'శ్రీ భానూరువాస శతకము'ను పరిశీ లిస్తే ఇది ఒక భక్తి శతకంగా తేలుతుంది. అందునా శైవభక్తి శాఖ కిందికి చేరుతుంది. తాత్త్విక దృష్టితో చూస్తే అద్వైతానికి కూడా అవకాశం ఉండవచ్చు. కాని శతకకర్త ఆ ఛాయలకు పోయినట్లు లేదు.

సంప్రదాయబద్ధంగా శ్రీకారం తో శతకాన్ని ప్రారంభించారు. అన్నీ తేటగీతి పద్యాలే. ఈ శతకానికో ప్రత్యేకత ఉంది. అది ప్రతి శతక పద్యానికి ముందు శివనామ స్మరణ చేసి పద్యాన్ని ప్రారంభించటం. దీన్నే వారు శవాష్టోత్తర శత నామ సహితము' అని భక్తి పూర్వకంగా పేర్కొన్నారు. అంతే కాదు ఆ నామంలోని భావాన్ని కూడా సాధ్యమైనంతవరకు ఆ పద్యంలో పొదిగే ప్రయత్నం చేశారు. ఉదాహరణకు మొదటి పద్యమే చూడండి.

**ఓం శివాయ నమః**
**శ్రీకరమ్మట నీ పేరు చిద్విలాస!**
**ఉచ్ఛరించిన పాపమ్ము లుడుగును 'శివ'!**
**విన్న జీవులు ధన్యులై వెలుగుదురట!**
**స్ఫటిక లింగేశ! భానూరు వాస! వరద!**

శివాష్టోత్తర శత నామాలలో శివుడు ఒకడు. శివ శబ్దానికి శుభము అని అర్థం. దీన్ని ఆధారం గా చేసుకొని శివనామ స్తోత్రం చేయగానే శుభాలు చేకూరునన్నది సార్థకం. భానూరు గ్రామంలో ఉన్నది 'స్ఫటిక లింగం' కావటం వల్ల-జీవులు ధన్యులై 'వెలుగుదురట' అని కూడా శర్మగారు అంటున్నారు. స్ఫటికం ప్రకాశమానం కనుక అది జీవితాలను వెలిగించటం సాభిప్రాయమే.

**ఓం విరూపాక్షాయ నమః**
**వెలుగు రవి నీదు కుడికన్ను విశ్వనాథ!**
**చంద్రుడెడమ కన్నట నీకు చంద్రమౌళి!**
**అగ్ని నొసటి నేత్రము 'విరూపాక్ష!' నీకు**
**స్ఫటిక లింగేశ! భానూరు వాస! వరద!**



ప్రతులకు:
డా॥ భోగయగారి చన్ద్రశేఖర శర్మ, 32,
న్యూ వాసవి శివనగర్
డీమార్ట్ రోడ్, కుషాయిగూడ
హైదరాబాద్-500 062
సెల్: 9440044142.

అన్న పద్యం చూడండి. విరూపాక్షుడంటే- వికారము గల కన్నులవాడు. ఇది నైఘంటికార్థం. కుడికన్ను సూర్యుడు, ఎడమకన్ను చంద్రుడు, నొసటి కన్ను అగ్నిగా సాంప్రదాయక పౌరాణికార్థం తీసుకుని నైగంటి కార్థాన్ని శర్మగారు పరిహరించి కుడికన్ను సూర్యుడు కావటం, క్షేత్రం 'భానూరు' (భాను+ఊరు) కావటం సార్థకంగా ఉంది. ఉత్వం గానో, సవర్ణదీర్ఘం గానో 'భానూరు'ను సాధించటం వికృతమని ఎవరైనా అంటే, మరి 'విరూప' శబ్ద ప్రభావం ఆ మాత్రం ఉంటుందని సమర్థిం చుకోవచ్చు.

**ఓం భక్తవత్సలాయ నమః**
**'భకంతవత్సల!' శశిధరా! భవ వినాశ!**
**పచ్చి గంగకే సంతోషపడెద వీవు**
**నిత్యమభిషేకము నొనర్తు నీలకంఠ!**
**స్ఫటిక లింగేశ భానూరువాస! వరద!**

ఈ పద్యంకూడా లోతైనదే. దక్షయజ్ఞానాన్ని ధ్వంసం చేస్తున్నప్పుడు తన కాలి క్రింద పడి పీడితులైన చంద్రుణ్ణి దయ తలచి శివుడు శిరస్సు మీద ధరించాడు. ఈ చర్య మూలంగా శివుడు 'భక్తవత్సలు' డైనాడు. తద్వారా శశిధరుడైనాడు. విషాన్ని కంఠం లో ధరించడం వల్ల, ఆ మంటకు కమిలి నీలకంఠు డైనాడు. ఆ బాధను తొలగించటానికి కవి నిత్య జలాభిషేకం చేస్తున్నా డు. గంగమ్మ చేస్తున్న సేవకు ఈ భక్తకవి సేవ అదనం.

అక్కడక్కడ శైవ పురాణాంతర్గత గాథలను పాఠకులకు స్మరణకు తెచ్చే శతక పద్యాలను కొన్నింటిని శర్మగారు రచించారు.

**ముని మృకండుని పుత్రుడు మున్ను నిన్ను**
**శరణమని వేడ నాతని మరణ ముడిపి**
**కాలు నుదుపు జేసితివట 'కాలకాల!'**

మృకండముని పుత్రుడు మార్కండేయుడు, శివుని కృపచే అతడు మృత్యువును జయించిన కథ ఈ పద్యం చదివిన ఎవరి కైనా గుర్తుకు వస్తుంది. అట్లాగే..

**స్థాణువీవు కఠోరమౌ తపము నీది**
**మార సంహర్తవీవు 'కఠోరు'డీవు**
**కాల్చి చంపినన్ బ్రతికించు కరుణ నీది**

అనే పద్యం శివుని దృష్టిని పార్వతి మీదకు మళ్ళించే ప్రయత్నంలో మన్మథుడు విఫలమై అతని మూడవ కంటిమ ంటకు బూడిదయైన పురాణగాథను గుర్తుకు తెస్తుంది. కాళిదాస మహాకవి 'కుమార సంభవం' కూడా గుర్తుకు రాక మానదు.

**చవితి పండుగ రోజున చందమామ**
**గణపతిని జూచి నవ్వంగ గల్గె నెవ్వ**
**లట్టి చంద్రుని గాచితి వాదరించి**
**శుభదురడవుడైతి వతనికి 'సోమ ప్రియుడ!'**

ఇదీ పురాణాంతర్గత గాథావిశేషాన్ని స్ఫురణకు తెచ్చేదే. చవితి పండుగరోజు బాగా తిని నడవలేక నడుస్తున్న గణపతిని చూసి నవ్వినందుకు చంద్రునికి పార్వతి ఇచ్చిన 'అపవాదు' శాపం కష్టాన్ని కలిగించింది. అనేక సందర్భాలలో చంద్రుని కాపాడిన శివుడు అతని పాలిట శుభప్రదుడైనా డంటున్నారు శర్మగారు.

తాము పనిచేస్తున్న పాఠశా లల్లో సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థినీ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి దోహదం చేసేవారు తెలుగు పండితులే. ఉన్నత స్థితిని సాధించిన సాహితీవేత్తలు తమ తొలినాటి రచనలను సంస్కరించి మంచి మార్గం చూపించినవారు తెలుగు పండితులే అని ఇంటర్వ్యూలలో చెప్తుంటారు. అంతే కాదు స్కూల్ మ్యాగజిన్లలో తమ తొలి రచనలను ప్రచురించి ప్రోత్సహించినవారు కూడా అలనాటి తెలుగు పండితులే అని ఎప్పుకోవటం తెలిసిందే.

అట్లాం టి తెలుగు పండితుల కోవకు చెందినవారు శ్రీ భోగయగారి చంద్రశే ఖర శర్మగారు. సొంత ఊరు కాకపోయినా, తాము పని చేస్తున్న భానూరులో వెలసిన స్ఫటికలింగేశుని ఉద్దేశించి భక్తి ప్రపత్తులతో శతకం వ్రాయటం ముదావహం. వారికి పద్య విద్యలో ప్రావీణ్యం ఉన్నందున ఒక కావ్యాన్నే వ్రాసి సత్తా చాటుకోవలసిందిగా కోరుతూ అభినందనలు తెలియ జేస్తున్నాను.



**-అమ్మంగి వేణుగోపాల్**
9441054637



**-డా॥రావి రంగారావు**
9247581825

2024 జనవరి నుండి ఫేస్బుక్ అమరావతి సాహితీ మిత్రులు గ్రూపులో, వాట్సప్ గ్రూపులో డా రావి రంగారావు సాహిత్యం వర్క్ షాపులు నిర్వహిస్తున్నారు. ఈ వారం వచన కవితల వర్క్ షాపులో విజేతల కవితలు చదవండి.అంశం... **"పట్టని తనం"**
-సంపాదకులు

## పట్టనితనం పట్టం

పట్టనితనం పట్టం కట్టుకుని,
మదిలో ప్రతి హృదిలో
మనసు రాజ్యమేలుతుంది
మహారాణిలాగా.
భయం సంకెళ్లు వేసి,
మనసును నిలబెడుతుంది ముద్దాయిగా.
అధికారం, ఆగ్రహం కన్నా
ఆత్మ గౌరవం మిన్న అని మరచి,
పట్టనితనం రాజ్య మేలుతుంది ఆనందంగా.
ఆశలనే ఆకర్షణ వలలు విసిరి,
మనిషిని చేస్తుంది బందీగా.
బాధించే బానిసత్వం కన్నా
స్వేచ్ఛ, సంతోషం మిన్న అని మరచి,
పట్టనితనం రాజ్యమేలుతుంది పరవశంగా.
చాపకింద నీరులాగా,
మానవత్వపు విలువలు చంపి...
అవమానం, అనుమానం కన్నా
ఆదరణ, ఆప్యాయత మిన్న అని మరచి,
పట్టనితనం రాజ్యమేలుతుంది కులాసాగా.
భావితరాల ఆశయాలను కాలరాచి,
జీవిత లక్ష్యాలను తుడిచేసి...
నిర్లక్ష్యం, నిరాశ కన్నా
ఆశయాలు, ఆలోచనలు మిన్న అని మరచి,
పట్టనితనం రాజ్యమేలుతుంది పరిహాసంగా...
కష్టాల పాలై బతుకులు చాలిస్తుంటే,
వేదన భరితమై కళ్ళు వర్షిస్తుంటే...
ఊరకుండటం కన్నా
మానవ శ్రేయస్సే మిన్న అని
చేయి చేయి కలిపితే
పట్టనితనం తొలగిపోతుంది సంతోషంగా!

**-బి. కోమలి సత్యవతి**
9989963383

## వెతికి తెద్దాం

చిగురు పరిమళాలను పండుటాకులు సైతం
పాశవికంగా ఆఘ్రాణిస్తున్నా
మౌనం ముసుగులో చరిస్తూ...
మాయల మత్తు ఫకీరు వలలో
యువత భవిత గతి తప్పుతున్నా
దేశసౌధ మూలాలను
గాలికి వదిచేస్తూ....
ఎండిన డొక్కలెన్నో పేగుల్ని ముద్దాడుతుంటే
కుప్పతొట్టికే నైవేద్యంలా ఆహారం అర్పిస్తూ
విలాసాల కౌగిట్లో పరవశిస్తూ....
కన్నీటి సంద్రాన్నే కనురెప్పల
మాటున దాచేస్తూ
కన్నపేగుల ఆశల్ని తీరాలు దాటిస్తున్నా
మమకారాలకే తిలోదకాలిస్తూ......
పాతాళాని కేగినా నీలిరంగు కనలేని బోర్లు
తడారిన గొంతుకలతో నదీమతల్లులున్నా
అడవితల్లి గుండెల్ని అడ్డంగా నరికేస్తూ....
నడిరోడ్డులో కత్తులు వీరవిహారం చేస్తూ,
అరుణ కాంతులు గుమ్మరిస్తుంటే
రంగు అంటుతుందేమోనని
పరుగులు తీస్తూ.....
మనోరథాలకు అరిషడ్వర్గాలే
అశ్వాలై స్వైరవిహారం
చేయిస్తుంటే
మానవత్వం గూడు వీడి
ఎగిరిపోయింది...
సౌభ్రాతృత్వపు జలధారలతో
అంతరంగానికి సంప్రోక్షణ
జరిగినప్పుడే
సొంత గూటిలో వాలుతానంటూ...

**-మేడిశెట్టి సుభద్రా కృష్ణ**
7396959347

# ఆకట్టుకున్న ఎస్. జానకీ పాటలకు స్వర నీరాజనం

హైదరాబాద్, ఆగష్టు 4: సుప్రసిద్ధ కవి గాయని ఎస్. జానకి స్మృతికి నివాళిగా శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం, ప్రజ్ఞా మెలొడిస్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఎస్. జానకి పాటలకు స్వర నీరాజనం కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సామాజిక కార్యకర్త ఘంట శివకల్యాణి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. 17 భారతీయ భాషలలో 45 వేలకు పైగా పాటలు ఆలపించి భారతీయ సంగీత చరిత్రలో చెరగని ముద్రవేసిన మహోన్నత గాయని ఎస్. జానకి అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జానకి పాటలకు స్వర నీరాజనం కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి, శ్రీధర్, ఆడామ్, రాధిక, అర్చన, కృష్ణ వేణి, పల్లవి సుగుణ, వెంకటేశ్వర్లు, నిమ్సన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాయకులకు సర్టిఫికెట్లు అందజేశారు.



గాయకులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న భూపతి వెంకటేశ్వర్లు.

# కవితార్చన



అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

## జీవన పయనంలో ధైర్యంగా సాగాలి

జీవితం సుఖ దుఃఖాల సాగరం
అన్నింటిని తట్టుకుంటూ పోవాలి
బాదలొచ్చాయని
భయపడకూడదు
ఓటమి ఎదురవుతుందని
ముందే ఊహించి..
లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నం
నిలపకు
అడ్డంకులు ఎన్ని ఎదురైనా
ఆపకు నీ పయనం
నడిచే దారిలో ముళ్ళు రాళ్లు ఉన్నాయని
పూల బాట కాదు అని బాధపడుతూ కూర్చుంటే
విజయం నీ సొంతం కాదు ఎన్నటికీ
కష్టాలు కలకాలం ఉండవు అనుకుని
ముందుకు సాగుతూ పయనిస్తూ..
సుఖాల తీరం చేరుతావు అని నమ్మకం పెంచుకుని
బాధ్యత మరువక నీ వాళ్లకు
భరోసాగా నిలిచే ప్రయత్నంలో..
ఆటుపోట్లు ఎన్ని ఎదురైనా చింతించకు.
కడుపున పుట్టిన వారిని కాచుకునేందుకు
ఇన్ని బాధలా అని తల పట్టుకోకు
కాచిన చెట్టుకే కదా కర్ర దెబ్బలు
అందుకే..
జీవన పయనంలో సుడి గాలులు ఎన్ని వచ్చినా బెదరక..
కట్టె కాలే వరకు నిజాయితీగా నిలవాలి.
అపుడే మనకు సమాజంలో మంచి స్థానం లభిస్తుంది.

-మోదేపల్లి శీనమ్మ
91 97048 54615

## ఆది దేవత

ఆది దేవత అమ్మ...
నా చేత తలరాతను మార్చేఅక్షరాలు దిద్దించిన శారదాదేవి,
నా భవితకు కలలుగన్న బంగారుబాటను సిద్ధం చేసిన పార్వతిదేవి,
నాలో అజ్ఞానమనే అంధకారాన్ని రూపుమాపిన సరస్వతీదేవి ,
నా విజ్ఞానానికి అవధులు లేని గమ్యం వేసిన గురువు,
నా మేధో సంపత్తికి అంతేలేని పరీక్షలు పెట్టిన ఉపాధ్యాయిని,
నా జీవన ప్రమాణాలకి ఊహించని ప్రతిఫలం చూపిన తత్వవేత్త,
నా ఆలోచనా సరళిని సన్మార్గంలో నడిపిన దిక్సూచి,
నా ఆవేదనా తరంగాల గమనం మార్చిన శ్రేయోభిలాషి,
నాకు ప్రేమానురాగాలు పంచే వారధిగా మారిన ఆత్మీయపెన్నిధి,
నాకు వెల కట్టలేని ఆదరాభిమానాలను పంచే ఆత్మీయురాలు,
నా అలసటలో విసిగి వేసారకుండా అక్కున చేర్చుకున్న కల్పతరువు,
నా ఆనందంలో తన వంతు పాలు పంచుకున్న స్నేహితురాలు,
నా కవితా దృక్పధానికి చక్కని పునాది వేసిన కామధేనువు,
నా కవితల పూలకు పరిమళాలద్దిన తోటమాలి,
నా ఊహలకు ఊపిరి,
నా ఆశలకు ఆయువు... అన్నీ అమ్మే.... ,
నన్నే నాకు కొత్తగా పరిచయం చేసిన అమ్మా...!
నీకిదే నా వందనమమ్మా...
నా అక్షర నీరాజనం అందుకొనుమమ్మా...!!

- భూపతి సుమశ్రీ
+91 85007 89389

## విధిచేతిలో వింత. బొమ్మలు

ఇంటినే వదిలారో
దూరంగా విసిరేయబడ్డారో
నిత్యం కన్నీటి కడవలైన నేత్రాలు
కదిలిస్తే అశ్రువుల గాథలు..
నగరాల్లో, వీధి కూడళల వద్ద..
ఎక్కడ పడితే అక్కడ కనిపిస్తారు..
చిరిగిన మాసిన దుస్తులతో..
అట్టలు కట్టిన శిరోజాలతో..
దీనంగా చేతులు చేస్తూ..
భిక్షాటన చేస్తూ లేదా దొంగతనాలు చేస్తూ..
కనిపిస్తారు వీధి బాలలు..
తల్లిదండ్రుల అక్రమ సంతానమో..
ముష్టి వాళ్ల చేత చిక్కిన విధి వంచితులో..
రోడ్డు మీద చెత్త ఏరుకుంటూ..
రకరకాల వస్తువులు అమ్ముతూ..
కార్మికులుగా పని చేస్తూ కనిపిస్తారు..
మాదక ద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు లోనవుతారు..
మత్తులో నేరాలు, ఘోరాలు చేస్తారు..
సరియైన తిండి, నిద్ర వుండదు..
అపరిశుభ్రత వలన అనారోగ్యం పాలవుతారు..
నిరంతరం అభద్రత, మానసిక ఆందోళన..
ప్రభుత్వం, ప్రజలు కలిసి వీరి బాధ్యత తీసుకుని..
భద్రత కల్పించి, చదువు నేర్పించి..
సమాజానికి పనికి వచ్చేలా తయారు చేయాలి..

-పంతుల లలిత
+91 82477 57492

## కలల సౌధము

కలలతో మొదలవుతుంది ప్రతి ఉదయం,
ఆశలతో నిండిపోతుంది ప్రతి హృదయం.
చిన్న కల అయినా చిగురించే దీపమై,
మన జీవిత మార్గానికి వెలుగై నిలుస్తుంది.
కలలు కేవలం నిద్రలో వచ్చే చిత్రాలు కావు,
మన గమ్యానికి దారి చూపే నక్షత్రాలు అవి.
పడి లేస్తూ సాగిన ప్రతి అడుగులో,
విజయపు సౌధాన్ని నిర్మించే శిల్పాలు అవి.
ఒక రైతు కలలో పచ్చని పంటలుంటాయి,
ఒక విద్యార్థి కలలో వెలుగైన భవిష్యత్తుంటుంది.
ఒక శాస్త్రవేత్త కలలో కొత్త ప్రపంచముంటే,
ఒక కవి కలలో మానవత్వపు సంగీతముంటుంది.
కలలే మనసుకు రెక్కలు ఇస్తాయి,
కష్టాల సముద్రాన్ని దాటించే పడవలవుతాయి.
ఆత్మవిశ్వాసం అనే గాలి వీచినప్పుడు,
అవి విజయ తీరాలకు తీసుకెళ్తాయి.
కలలు కనని జీవితం వెలుగులేని దీపం,
లక్ష్యం లేని ప్రయాణం దారిలేని నావం.
కలలే మనిషిని సాధారణం నుంచి
అసాధారణ శిఖరాలకు చేర్చే మెట్లు.
అందుకే యువత హృదయంలో కలలు మండాలి,
అవి దేశ భవిష్యత్తుకు దివ్యజ్యోతులవాలి.
ప్రతి కల ఒక కొత్త ఉదయాన్ని పిలుస్తూ,
మన భారతాన్ని మహోన్నతంగా తీర్చిదిద్దాలి

-కె.కె.రామచందర్
.+91 94934 02139

# సప్త పదులు

ప్రక్రియా సృజనకర్త: సుధామ



**నేర్పు**
మార్పు
జీవితం
మన చేతుల్లోనే
తీపిచేదుల
కూర్పు
-రాజకుమార్
యస్. రుద్రపాటి
విశాఖపట్నం

**అన్యము**
మాన్యము
ప్రకృతిలో
భగవానుని
చూడగలిగితే..
జన్మ ధన్యము.
-కాకర్ల
చెంచలరావు
ఒంగోలు.

**సర్దుబాటు**
దిద్దుబాటు
ప్రభుత్వాల నిర్లక్ష్యంకు
విద్యార్థుల
నిరసనలతో
భంగపాటు!
-గోపరాజు వెంకట
సూర్యనారాయణ
హైదరాబాదు.

**యోజనకారి**
ప్రయోజనకారి
ఇతరుల శక్తిని
పెంపొందించటానికి
వ్యవహరించే
దోహదకారి.
-కె. ఎం. కె. మూర్తి
సికింద్రాబాద్

**తప్పు**
చెప్పు
అహంకారం
తెస్తుంది
మనిషి జీవితానికి
ముప్పు!
-దినవహి సత్యవతి
గుంటూరు

**చలనం**
చాలనం
చెడు కాదు
మంచి
కావాలి
సంచలనం
-చంద్రకళ.దీకొండ
హైదరాబాదు

**ఆపత్తు**
విపత్తు
మన సంస్కృతి
సంప్రదాయాలకు
విలువివ్వడమే
నిజమైన సంపత్తు
-ద్విభాష్యం నాగలక్ష్మి
అనకాపల్లి

**ఆట**
పాట
బాల్యంలో
పిల్లల చదువు
జీవితానికి
బాట..!
-డాక్టర్ నెమిలేటి కిట్టన్న
తిరుపతి

# వృద్ధుల ఒంటరితనం.. కుటుంబ బంధాలకే సవాల్

భారతీయ సంస్కృతిలో వృద్ధులకు గౌరవప్రదమైన స్థానం ఉంది. కుటుంబానికి పెద్దదిక్కుగా, అనుభవానికి నిలయంగా వారిని భావించే సంప్రదాయం మనది. అయితే మారుతున్న జీవనశైలి, ఉమ్మడి కుటుంబాల స్థానంలో చిన్న కుటుంబాల పెరుగుదల, ఉద్యోగాల కోసం వలసలు, సాంకేతికత ప్రభావం వంటి కారణాలతో నేడు అనేక మంది వృద్ధులు తీవ్రమైన ఒంటరితనాన్ని ఎదుర్కొంటున్నారు. ఇది కేవలం కుటుంబ సమస్య కాదు; సమాజం మొత్తం ఆలోచించాల్సిన సామాజిక సవాలు.

వృద్ధులకు ఆర్థిక భద్రత మాత్రమే సరిపోదు. వారితో మాట్లాడే మనిషి, వారి భావాలను వినే కుటుంబ సభ్యుడు, అవసరమైనప్పుడు తోడుగా నిలిచే చేయి కూడా అంతే ముఖ్యం. రోజంతా ఇంట్లో ఒంటరిగా గడపడం వల్ల నిరాశ, ఆందోళన, జ్ఞాపకశక్తి సమస్యలు, శారీరక అనారోగ్యాలు పెరిగే ప్రమాదం ఉంది. పిల్లలు విదేశాల్లో లేదా ఇతర నగరాల్లో ఉండటం వల్ల ఈ పరిస్థితి మరింత తీవ్రంగా మారుతోంది.

ఈ సమస్యకు పరిష్కారం కుటుంబంతోనే ప్రారంభం కావాలి. ఎంత బిజీగా ఉన్నా ప్రతిరోజూ కొంత సమయం వృద్ధులతో గడపడం, వారి అభిప్రాయాలకు విలువ ఇవ్వడం, కుటుంబ నిర్ణయాల్లో వారిని భాగస్వాములను చేయడం అవసరం. చిన్నపిల్లల్లో తాతలు, అమ్మమ్మల పట్ల ప్రేమ, గౌరవం పెంపొందించే వాతావరణాన్ని తల్లిదండ్రులు కల్పించాలి.

అదే సమయంలో సమాజం కూడా తన బాధ్యతను గుర్తించాలి. స్థానిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వృద్ధుల సంఘాలు ఆరోగ్య శిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పరస్పర సమావేశాలు నిర్వహిస్తే వృద్ధులకు కొత్త ఉత్సాహం కలుగుతుంది. ప్రభుత్వం వృద్ధులకు అనుకూలమైన ప్రజా వసతులు, ఆరోగ్య సేవలు, అత్యవసర సహాయ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలి.

ఒకప్పుడు పిల్లలకు అండగా నిలిచిన చేతులు నేడు మన ఆప్యాయతను కోరుకుంటున్నాయి. వృద్ధుల ఒంటరితనాన్ని తగ్గించడం దానం కాదు, మన సంస్కృతికి చెల్లించే ఋణం. వృద్ధులు ఆనందంగా, ఆత్మగౌరవంతో జీవించే సమాజమే నిజమైన అభివృద్ధి సాధించిన సమాజంగా నిలుస్తుంది.



-సి. హెచ్.ప్రతాప్
78938 00733

# బ్రహ్మనిష్టులు జక్కని వారు

జక్కని వేంకటరాజం రచించిన 'చిత్స్వరూప శతకం' కు ఆచార్య మసన చెన్నప్ప రాసిన ముందుమాట

**"చిత్తవృత్తుల నధిగమించుచు**
**ప్రకృతి పురుష వివేకమలరగ**
**చిత్ స్వరూపుని ఆత్మలోపల**
**గొలుచువారే యోగుల గుదురు"**

ఈ ముత్యాలసరం నా "యోగస్వరాలు" అనే కృతి లోనిది.

సచ్చిదానంద స్వరూపుడైన పరమేశ్వరుడు యోగులకు మాత్రమే సాక్షాత్కరిస్తాడు. అట్టి పరమేశ్వరుని చిన్మయ విలాసాన్ని ఆటవెలది, తేటగీతి పద్యాలలో ఒక శతకంగా సంతరించిన శ్రీ జక్కని వేంకటరాజం గారికి నా నమస్సులు.

జక్కని వారు సంసారంలో సంభవించే సుఖదుఃఖాలను అనుభవించినవారే. అంతేకాదు వాటి నధిగమించి ఆధ్యాత్మిక జీవనం గడుపుతున్న వారే.

**"లౌకికంబైన జగతిలో లాభమేమి?**
**శోకముండును కొంతయు సుఖము నుండు"**-14

ఇట్టి సుఖదుఃఖాలనే ద్వంద్వాలకతీతంగా నిలబడడానికి ఆవశ్యకమైంది యోగం. యోగాన్ని అవలంబించి నిరంతరం చిత్ స్వరూపుడైన పరమాత్మను తన హృదయాకాశంలో నిలుపుకున్న జక్కని ధన్యుడు.







ప్రతులకు: 'గురుకృప'
నెం. 7-2-109,
సుభాష్ నగర్,
సిరిసిల్ల-505 301
రాజన్న సిరిసిల్లా జిల్లా
సెల్: 9440021734

**"ఎవరి సానుభూతి ఇచట నాకు వలదు**
**బంధ వేలనింక బ్రతుకు నందు?**
**ఆత్మయందున పరమాత్మనే దర్శింతు**
**చేరి కొలుతు నిన్ను చిత్స్వరూప!"** -43

ఈ పద్య భావాన్ని గమనిస్తే జక్కని ఆధ్యాత్మికంగా పరిణతి సాధించిన వారనిపిస్తుంది.

జక్కని నన్నాదర్శంగా గైకొని ఎనిమిది ఉపనిషత్తులను ముత్యాల సరాలలో తెనిగించారు. నాకు తెలిసినంత వరకు ఉపనిషత్తులను ముత్యాల సరాలలో తెనిగించిన వారలం మేమిద్దరమే. పరమేశ్వరుడీ అవకాశాన్ని ఇచ్చినందుకు మాకెంతో ఆనందంగా ఉంది.

బ్రహ్మనిష్ట గలిగినవారికే మోక్షం లభిస్తుంది.

**"బ్రహ్మనిష్ఠయే కలిగిన బ్రతుకునందు**
**ముక్తి దొరకును, ఆయువు ముగిసెనేని**
**మరల జర్మము కలుగదు మనుజులకును"**- 69

వేద సిద్ధాంతాన్ని తెలుసుకొని, ఉపనిషత్తులను అవగాహనకు తెచ్చుకొని, ఆధ్యాత్మిక విద్యను సరళ సుబోధకమైన శైలిలో పాఠకులకు అందించిన వారు చాలా అరుదుగా ఉంటారు. దైవానుగ్రహం వల్ల శతక రచనాను భవంతో పాటు, ఉపనిషద నువాద పటిమగల జక్కని వారు మనకీ 'చిత్స్వరూప శతకం' అందిస్తున్నారు. నా హృదయ పూర్వకమైన అభినందనలు తెలియజేస్తున్నాను.



- మసన చెన్నప్ప
9885654381

## చినుకు కోసం వెతుకుతున్నాడు

భానుడి వేడి చురకలకు కరిగిపోయే
కడలి తన గుణాన్ని మరిచిపోయి
సుతారంగా సుప్తావస్తలోకి జారిపోయింది
నీటి ఆవిరి నింగిలోకి చేరడం మరిచిపోయి
నింగికి నేలకు బంధం తెగిపోయినట్లయింది.
నింగిలో కదిలే మేఘాలు కనుమరుగై
నిరాశల చీకట్లు చిక్కగా కమ్ముకొని
కర్షకుల కళ్ళల్లో కన్నీళ్లు
సుడులు సుడులుగా తిరుగుతున్నాయి
చినుకుకు తనువంతా చిత్తడయ్యే నేల
ఇప్పుడు నెర్రలు బారి దాహం కోసం
ఎడారిలో నీళ్ల కోసం వెతికే జీవిలా మారింది.
ఎన్నో ఆశలను పోగేసుకున్న రైతన్న
ప్రకృతి తిరోగమనానికి మనసు చెరువై
గుండె బరువై దిగులు పక్షిలా దీనంగా చూస్తుండు
శూన్యం పెయ్యిపై పేరిణి నాట్యమాడుతుంటే
రైతన్న భవిత బీటలు బారుతుంది.
ఇప్పుడు రైతన్న యుద్ధంలో ఓడిపోయిన
సైనికుడిలా నిరాశల శూన్యంలో నడుస్తుండు
పచ్చని పొలం గట్ల మధ్య తిరిగే రైతు
నేడు నింగికి నీలాలను కట్టేసి
మౌన వంతెనపై మునిలా సాగుతున్నాడు.
రైతన్న బతుకు ఎప్పుడూ అతుకుల బొంతే
మనసంతా అలజడుల చింతే
ఇప్పుడు అందరూ గుడిలో దేవుడి కోసం
వెతుకుతుంటే రైతన్న మాత్రం చినుకు కోసం
వెతుకుతున్నాడు
జనం వరాల కోసం దేవున్ని కొలిస్తే
నేను మాత్రం రైతన్న మేలు కోసం తలుస్తా
ఎందుకంటే నేను తినే నాలుగు మెతుకులు
అతడు పెట్టిన బిక్షే కదా !



-తాటిపాముల రమేశ్
7981566031

## ఎవరు దోషి ?

నిరుద్యోగ నీలాకాశాణ్ణి నేను
కట్టలుతెంచుకుటున్న
ఆకలిఆవేశాణ్ణి నేను
జాబుల ప్రకటనలు ఏవని
అరిచి ప్రశ్నించే గొంతు సైతం
కోల్పోయిన మూగవాణ్ణి
పోరాడిన ప్రజల స్వప్నాల నేలమీద
అమరవీర త్యాగాల చరిత్ర సాక్షిగా
జవాబు లేని రాజ్యం ఇదేనా?
గ్రీష్మ కాల వేడిగాలిలో వయసుఎండిన ఆకుల్లా
నేల రాలుతున్నవాణ్ణి నేను
తొలకరి వానకోసం
నెర్రలిడిసి ఎడారితీరు తదేకంగా
ఎదురుచూస్తున్న చెరువుగుండెలా
ఉద్యోగ ప్రకటనల కోసం
ఎదురుచూపుల్లో యేళ్ళుగా
పరితపిస్తున్న రాష్ట్ర యువరక్తాన్ని నేను.
కన్నవారి కలలలోక ఆకాశంలో
వెలసిన శోకమేఘ శకలం నేను
పిడుగులా అరవ లేని అమాయకుణ్ణి నేను
అడుగులా కదల లేని అచేతనుణ్ణి నేను
చదివీచదవి కళ్ళు ఖర్జూరములైన మానవుణ్ణి
నేను
చేదెక్కుతున్న నౌకరులేని నరుణ్ణి నేను
ఏదయ్యా? జాబు? ఎక్కడుంది?
ఇది కొత్తకొలువుల గ్రహణ కాలమా?
రాజ్యానికి రాహుకాలమా?
ఏదీ మీ ఉద్యోగ ప్రకటన?
అంతా ధాంబికాల నటన!
అంతా అంకెల గారడి.
నిరాశా నిట్టూర్పుల ఒడిగా
కనిపించని కన్నీటితడిగా
నిరుద్యోగికి నిర్వచనంగా ధ్వనిస్తోంది.
నన్ను అంతంకాని దశాంశంలెక్క
ఆవేదనగా మలిచిన ఎవరు ఆ దోషి ?
నడుస్తున్న కాలం ఎవరిది?
నా కలలను ఖండిస్తున్న కరవాలం ఎవరిది?.

-రమేశ్ నల్లగొండ
8309452179



నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..
-సంపాదకులు

## ఇంటింటి మొక్కు బోనాలు

ఇప్పుడిదేం కాలమో ?
వరుణుడి ముఖం చాటుతనం !!
కార్తెల కన్నెర్ర !
నెర్రలు బారిన పంట పొలాలు అనావృష్టి
కాన్వాసు
ప్రజల అంతు పట్టని "ఎల్ నినో".
ఇగ ఈ రోజు బోనం ఎత్తుకున్నాకా
వాన మబ్బులు పెద్ద బోనం లెక్క కట్టకట్టుకుని
ఉరుములతో మెరుపులతో రావాల్సిందే !
చెరువులు నిండి మత్తడి ఎత్తుకోవాల్సిందే !.
ఎప్పుడైనా సరే భవిష్యవాణి అందరికీ
ఆసక్తిదాయకంగా ఆశ్చర్యంగా
ఆనందప్రదంగా దైవవాణే కదా.
అమ్మకు తెలుసు వర్తమానంలో
వానలు లేని మట్టి పొడిబారినతనం !
నాగలి నడవని అవిటితనం కాలం
రైతు బతుకున పడ్డ పెద్ద బండగా
కొండంత దుఃఖం
ప్రజల కంటి జలజల ఆకలి బాష్పాలు
బోనమెత్తుకున్న భాగ్యనగరం సందడికి
వాన దేవుడు దిగిదిగి రావాల్సిందే.
గోల్కొండ కోటలో జగదాంబిక
మొగులును కిందకు దింపాల్సిందే !
బోనాల పండగంటే లోక క్షేమంగా
ఊరు వాడ తరలి రావాల్సిందే
అందరి తలల పైనా బోనాలు
ఇంటింటి మొక్కు!
అదిగో ! ఆకాశంలో మెరుపులు
బోనాలకు అభిషేకం !
లోకానికి యోగక్షేమం !

- కందాళై రాఘవాచార్య
8790593638

## ప్రాణవాయువా? ప్రాణహానియా!

కాలుష్య కౌగిలిలో
ప్రకృతి కాంత
గిలగిలలాడుతోంది.
ప్రాణవాయువును ఇవ్వలేకపోతున్నానని
కన్నీరు కారుస్తోంది.
నదులు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరవుతున్నాయి.
గాలి విషపు వాసనను మోస్తోంది.
భూమి తన గర్భాన్నే తాను భరించలేక
మౌనంగా విలవిల్లాడుతోంది.
అయినా?
అహంకార రాజకీయాలు
కాలుష్యానికంటే
ఎత్తైన గోడలు కడుతున్నాయి.
ప్రాణాలు పోయినా పరవాలేదు
అధికారాలు
చేతులు మారకూడదనే
కపట నీతులు
మొసలి కన్నీళ్లు కారుస్తున్నాయి.
ఉచితాల ఊబిలో
వివేకాన్ని ముంచి,
నటనలతో
నిజాలను కప్పిపుచ్చుతున్నాయి.
నాయకుల మాటల్లో
ప్రాణరక్షణ.
చేతల్లో మాత్రం
ప్రాణహాని.
మూసీ వంటి నదులు
మన నిర్లక్ష్యంతో
మరణిస్తున్నాయి.
వాటిని కాపాడాలనుకునే ప్రతి అడుగునూ
వివాదాల బురదలోకి
లాగుతున్నారు.
ప్రశ్న ఒక్కటే?
ముక్కులను మూసుకుని బతుకుతామా?
లేక
నదుల ఊపిరిని కాపాడి,
మన ఊపిరినీ
కాపాడుకుంటామా?
ప్రాణవాయువు లేని అభివృద్ధి
ప్రగతేనా!
ప్రకృతిని రక్షించడం
రాజకీయం కాదు?
మనుగడ.
నది చనిపోతే
నీళ్లు మాత్రమే కావు...
మనిషి భవిష్యత్తూ
మునిగిపోతుంది.

-సుదర్శనం వేణుశ్రీ

## ఇంటింటి మొక్కు బోనాలు . . .



ఇప్పుడిదేం కాలమో?
వరుణుడి ముఖం చాటుతనం!!
కార్తెల కన్నెర్ర!
నెర్రలు బారిన పంట పొలాలు
అనావృష్టి కాన్వాసు
ప్రజలకు అంతు పట్టని "ఎల్ నినో".
ఇగ ఈ రోజు బోనం ఎత్తుకున్నాకా
వాన మబ్బులు పెద్ద బోనం లెక్కానే
కట్టకట్టుకుని ఉరుములతో
మెరుపులతో రావాల్సిందే!
చెరువులు నిండి మత్తడి ఎత్తుకోవాల్సిందే!.
ఎప్పుడైనా సరే భవిష్యవాణి అందరికీ
ఆసక్తిదాయకంగా ఆశ్చర్యంగా
ఆనందప్రదంగా దైవవాణే కదా.
అమ్మకు తెలుసు వర్తమానంలో
వానలు లేని మట్టి పొడిబారినతనం !
నాగలి నడవని అవిటితనం కాలం !
రైతు బతుకున పడ్డ పెద్ద బండగా కొండంత
దుఃఖం
ప్రజల కంటి జలజల ఆకలి బాష్పాలు.
బోనమెత్తుకున్న భాగ్యనగరం సందడికి
వాన దేవుడు దిగిదిగి రావాల్సిందే.
గోల్కొండ కోటలో జగదాంబిక
మొగులును కిందకు దింపాల్సిందే !.
బోనాల పండగంటే లోక క్షేమంగా
ఊరు వాడ తరలి రావాల్సిందే
అందరి తలల పైనా బోనాలు
ఇంటింటి మొక్కు!
అదిగో ! ఆకాశంలో మెరుపులు
బోనాలకు అభిషేకం !
లోకానికి యోగక్షేమం !

-కందాళై రాఘవాచార్య
8790593638

## పని ముసలి కాదు

పని పని పని పని ...
నిత్యం పొద్దు మాపుల పని
ఎంత చేసినా తీరని పని
పని ఎన్నటికీ ముసలి కాదు! .
చిన్నప్పుడు తెలియదు కానీ...
మనల్ని పెంచేది ఒక పని అని
తిండి తిప్పలకు తప్పని పని
ఆకలితో మనం బతకలేము కదా !.
తెలిసినప్పటి నుండి చూస్తున్నా...
పనిచేస్తేనే వస్తుంది ధనమని .
పుడుతాము... పెరుగుతాము.
పిల్లలు పుడతారు..మనం పని చేసిచేసి .
ముసలి వాళ్ళమై పోతాము...
ఆ పని మాత్రం అట్లాగే ఉంటుంది! .
అంట్లు తోముడు ఆఫీస్ పని...
పొలం పనినుండి పరిశ్రమ వరకు ...
అలుపు లేక అన్నీ పనులు చేస్తేనే
అవనికి అందం గా అలరారుతుంది!
మనం ఎంత పని చేసినా...
మన ముందు మరోపని వేచి ఉంటుంది .
ఏ కాలమైనా ఎండని గరిక లెక్క
ఈ పని మాత్రం ముసలి కాదు! .
పని పూజించ తగినదని చెప్పిన .
రవీంద్రుని మాట నిజమని తెలుసుకో...
పనిలేని మనిషి
పిచ్చి వాడవుతాడని దేవుని భయం .
అందుకే కనిపించని అకలి పెట్టాడు .
ఈ అకలే పని ఆరాటం ...
మనిషి బ్రతుకు పోరాటం!.
ఆకలి లేకుంటే అవని ఎట్లుండేదో...
అలుకు పూతలు ముగ్గులు లేని
పాడుపడిన ఇల్లు వలే ఉండేదేమో!.
కలుపు తీయని పంటపొలం వలే
వుండేదేమో!
పని ఎన్నటికీ ముసలి కాదు!

- పట్లోళ్ల బక్కారెడ్డి
9705315250

